RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

తెలుగు దిన పత్రిక

PUBLISHED FROM : TELANGANA ANDHRAPRADESH | సంపుటి: 11 | సంచిక : 450 | ఎడిటర్: చింతల రామకృష్ణ | మంగళవారం, ఆగస్టు 21, 2024 | పేజీలు: 6 | వెల: రూ.3/-









భారీ వర్షాల నేపథ్యంలో

# కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

- విద్యా సంస్థలకు సెలవులపై కలెక్టర్లదే నిర్ణయం
- పదిరోజుల్లో ధరణి దరఖాస్తులు పరిష్కరించాలి
- 23, 24 తేదీల్లో నూతన "రెవెన్యూ" ముసాయిదాపై జిల్లాల్లో వర్క్ షాప్ లు.
- ఎల్ఆర్ఎస్ పర్యవేక్షణకు ప్రతి జిల్లాకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్
- భారీ వర్షాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రెవెన్యూశాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్: రాష్ట్రంలో విస్తృతంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జనజీవనానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మరో ఐదు రోజులపాటు భారీ వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదురుకోవడానికి జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, నూతన రెవెన్యూ చట్టం -2024 ముసాయిదా, ధరణి దరఖాస్తులు, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై తెలంగాణ చీఫ్ సెక్రెటరీ శ్రీమతి శాంతి కుమారి మరియు జిల్లా కలెక్టర్లతో మంగళవారం నాడు ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి మంత్రిగారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఐదు రోజుల్లో వర్షాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక పరిస్థితులను బట్టి విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించే నిర్ణయాన్ని కలెక్టర్లు తీసుకోవాలని సూచించారు.

గత రాత్రి నుంచి గ్రేటర్ హైదరాబాద్, నిజామాబాద్ తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిసినా వీలైనంత మేరకు ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పరిస్థితిని గురించి మంత్రిగారు కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలలో చేపట్టవలసిన రక్షణ చర్యల గురించి ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ లో మున్సిపల్, మెట్రో వాటర్ బోర్డు, ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి. జిల్లా కలెక్టర్లు ఏ విధమైన ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా సంబంధిత ప్రభుత్వ విభాగాలతో కలిసి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ప్రతి కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏ విధమైన సహాయం కావాలన్న రాష్ట్ర రాజధానికి ఏ సమయంలోనైనా సంప్రదించవచ్చని మంత్రి గారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకురాబోతున్న నూతన రెవెన్యూ చట్టం 2024 పై ప్రజల నుంచి విస్తృత స్థాయిలో అభిప్రాయ సేకరణ జరపాలని ఇందులో భాగంగా ఈ నెల 23, 24 తేదీల్లో ఆయా జిల్లాల్లో స్థానిక పరిస్థితులను బట్టి నూతన రెవెన్యూ చట్టం ముసాయిదాపై వివిధ రంగాల మేధావులతో వర్క్ షాప్ నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు.

ధరణి సమస్యలపై గత ప్రభుత్వంలో వచ్చిన దరఖాస్తులతో పాటు ఇటీవల కాలంలో కొత్తగా వచ్చిన దరఖాస్తులను వచ్చే పదిరోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. తిరస్కరించిన దరఖాస్తులకు సరైన కారణాలను తెలియజేయాలని సూచించారు. ముఖ్యంగా రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో దరఖాస్తుల పెండింగ్ అధికంగా ఉందని ఈ జిల్లాలపై ప్రధానంగా దృష్టి సారించాలని రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ ను ఆదేశించారు. లక్షాలాది కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చే లేఅవుట్ రెగ్యులరైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. నిబంధనల ప్రకారం మాత్రమే భూముల క్రమబద్ధీకరణ జరగాలని ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పకడ్బంధీగా చర్యలు తీసుకోవాలి. ఎల్ఆర్ఎస్ క్షేత్రస్థాయి తనిఖీల కోసం స్పెషల్ టీమ్ లతో పాటు హెల్ప్ డెస్క్ లను కూడా ఏర్పాటు చేసుకోవాలి.

మొత్తం ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి జిల్లాకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ను పర్యవేక్షణ అధికారిగా నియమించాలని సీఎస్ గారికి సూచించారు. ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో అవసరమైన మేరకు డాక్యుమెంట్లు ఇవ్వని పక్షంలో ఇప్పుడు తీసుకుని ఎల్ఆర్ఎస్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆప్ (%ూాజూాజూ%) లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రతి జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద మొదటి దశలో వంద ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. ఇందులో ఎదురయ్యే మంచి చెడులను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకోవాలని అధికారులను సూచించారు. గత ప్రభుత్వంలో 2020 లో ఎల్ఆర్ఎస్ కోసం దాదాపు 25 లక్షల దరఖాస్తులు వచ్చాయని గత నాలుగు సంవత్సరాలుగా ఈ దరఖాస్తులు ఎలాంటి పరిష్కారానికి నోచుకోలేదని దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు.

# పేదల జీవితాల్లో మార్పు తేవడమే లక్ష్యం

### మెరుగైన శిక్షణ, సుస్థిర జీవనోపాధి కల్పిస్తాం
### పేదలతో నాది పేగు బంధం- మంత్రి సీతక్క
### నాలుగు వేల నిరుపేద కుటుంబాలకు బ్రాక్ వెన్నుదన్ను
### సెర్ప్ తో అవగాహన కుదుర్చుకున్న బ్రాక్ ఇంటర్నేషల్



నిరుపేదల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క స్పష్టం చేసారు. పేదరికం నుంచి వచ్చిన తనకు పేదలతో పేగు బంధం ఉందన్నారు. బహు రూపాల్లో ఉన్న పేదరికాన్ని రూపుమాపే దిశలో తమ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని గుర్తు చేసారు. పేదరిక నిర్మూలన కోసం తమ ప్రభుత్వం చేస్తున్న పోరాటంలో పాలుపంచుకోవాలని స్వచ్ఛంధ సంస్థలకు పిలుపునిచ్చారు. మంగళవారం నాడు తెలంగాణ సచివాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (%ాజుౌాా%), పలు దేశాల్లో పేదరిక నిర్మూలన కోసం పనిచేస్తున్న బ్రాక్ ఇంటర్నేషనల్ అనే అంతర్జాతీయ సంస్థ అవగాహన కుదుర్చుకున్నాయి. ఈ అవగాహన మేరకు తెలంగాణ లోని కొమురం భీం ఆసిఫాబాద్, ములుగు, నాగర్ కర్నూల్, నారాయణపేట్, వికారాబాద్ జిల్లాల్లో ప్రయోగాత్మకంగా నాలుగు వేల అత్యంత పేద కుటుంబాలను గుర్తించి వారిని పేదరికం నుంచి బయటకి తెచ్చేలా బ్రాక్ పనిచేయనుంది. మూడు సంవత్సరాల కాలం పాటు ఆయా కుటుంబాలకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం మొదలుకుని మెరుగైన జీవనోపాధి కల్పించే దాకా అన్ని విధాలుగా బ్రాక్ సహాయ సహకారం అందించనుంది. దానికి సంబంధిచిన విధి విధానాలపై చర్చ జరగ్గా మంత్రి సీతక్క పలు కీలక సూచనలు చేసారు. పేదరిక నిర్మూళన విధి విధానాలు నగరాల్లో రచిస్తే సరిపోదని..క్షేత్ర స్థాయిలో ప్రజలేమి ఆశిస్తున్నదానికి అనుగుణంగా కార్యచరణ సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా సమాజంలో ఇంకా అసమానతలు పెరగడం, పేదరికం ఉ ఒడటం బాధకరమన్నారు. ఆర్దిక రంగంలో దేశం దూసుకపోతున్నా...నిరుపేదలకు, అట్టడుగు వర్గ ప్రజలు కనీస అవసరాలకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. మారిన అవసరాల నేపథ్యంలో సామాన్యులు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. బహు రూపాల్లో ఉన్న పేదరికాన్ని అంతమొందించేందుకు తమ ప్రభుత్వంలో కలిసి పని చేయాలని స్వచ్ఛంధ సంస్థలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం, ప్రజా సంఘాలు, సేవా సంస్థలు అంకితభావంతో పని చేస్తే పేదరికం అనేది ఉండదన్నారు. పేదలకు నైపుణ్య శిక్షణ ఇచ్చి సుస్థిరమైన జీవనోపాధి కల్పించే దిశలో తమ ప్రభుత్వానికి చేయుతనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్కతో పాటు పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, పలు జిల్లాల అడిషనల్ కలెక్టర్లు, డీఆర్డీఓలు, బ్రాక్ ఇంటర్నేషల్ సంస్థ ఇండియన్ హెడ్ శ్వేతా బెనర్జీ, ఆగాఖాన్ ఫౌండేషన్ సీఈఓ టిన్ని స్వప్ని, ప్రధాన్, క్రిస్ప్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. క్షేత్ర స్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులపై తాము చేసిన అధ్యయన వివరాలను పంచుకున్నారు. అయితే తెలంగాణలో పేదలకు మెరుగైన శిక్షణ ఇచ్చి వారికి స్థిరమైన జీవనోపాధి కల్పించేందుకు ముందకు వచ్చిన అంతర్జాతీయ సంస్థ బ్రాక్, ఇతర సంస్థల ప్రముఖులను మంత్రి అభినందించి సత్కరించారు.



సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీ ఖాన్

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో మరో భూమ్ రాబోతుంది

### నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు పదివేల కోట్లు కేటాయంపు
### మెట్రో పొడగింపు తో పాటు ఫ్యూచర్ ముచ్చర్ల,వృత్తి నైపుణ్య విశ్వవిద్యాలయలకు శ్రీకారం
### మూసి ప్రక్షాళనకు ప్రణాళికలు
### భారీ స్థాయిలో విదేశీ పెట్టుబడులతో అంతర్జాతీయ నగరంగా హైదరాబాద్
### -మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 20: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,ఐటి మరియు పరిశ్రమల శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లు తీసుకుంటున్న విప్లవాత్మకమైన నిర్ణయాలతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగంలో మరో భూమ్ రాబోతుందని రాష్ట్ర నీటి పారుదల మరియు పౌర సరఫరాల శాఖామంత్రి యన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అంతే గాకుండా నిర్మాణ రంగంలోనూ గణనీయమైన వృద్ధి కనిపిస్తోందని ఆయన చెప్పారు. మంగళవారం హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లో 'తెలంగాణ గోయింగ్ గ్లోబల్' అనే థీమ్‌తో జరిగిన కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) తెలంగాణ రాష్ట్ర సదస్సుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా, విశిష్ట అతిథిగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలు హాజరయ్యారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డిలు జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా సదస్సు నుద్దేశించి మంత్రిఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నిర్మాణ రంగంలో జరుగుతున్న అభివృద్ధి కనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోనీ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ లో మౌలిక సదుపాయాల కల్పనకు గాను ఏకంగా పది వేల కోట్లు కేటాయించిందని ఆయన వెల్లడించారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, 162 కిలోమీటర్ల పొడవైన నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు, పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే, హైదరాబాద్ మెట్రో రైలు, తాగునీటి సరఫరా వంటి ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు పునాది వేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని ఆయన కొనియాడారు. కృష్ణా మరియు గోదావరి నదుల ఉభయ నదుల నుండి హైదరాబాద్ కు తీసుకొచ్చిన ఘనత కుడా ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వానిదే నన్నారు. రాష్ట్రంలో కొత్తగా అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో హైదరాబాద్‌కు ముచ్చెర్ల వద్ద ఫ్యూచర్ సిటీ, స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ, మెట్రో రైల్ విస్తరణ, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులతో సహా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ తరహా ప్రాజెక్టులు హైదరాబాద్ కే పరిమితము కాకుండా తెలంగాణ వ్యాప్తంగా ఉన్న టైర్-2, టైర్-3 నగరాల్లో కూడా అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించాయని, ఇవి గణనీయమైన అభివృద్ధిని సాధించగలవని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కృషితో తెలంగాణ వ్యాప్తంగా ఐటీ, సాఫ్ట్‌వేర్, తయారీ రంగాల్లో పెట్టుబడులు పెరిగే అవకాశం ఉందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉద్ఘాటించారు. తెలంగాణకు ప్రతిష్టాత్మకమైన రీజినల్ రింగ్ రోడ్డును తీసుకురావడంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి ముఖ్యపాత్ర పోషించారని, సదస్సులో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న క్రెడాయ్ సభ్యులు పాల్గొనడం అభినందనీయమని కొనియాడారు. తెలంగాణను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని క్రెడాయ్ సభ్యులకు ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. "మీ వ్యాపారం మరియు భవన నిర్మాణ కార్యకలాపాలన్నింటిలో, మా ప్రభుత్వం మీ వెంటనే ఉంటుందని మంత్రి ఉత్తమ్ భరోసా ఇచ్చారు. తెలంగాణలో పట్టణీకరణ వేగవంతంగా రూపాంతరం చెందుతుందని ఇప్పటికే సుమారు 45% పట్టణ ప్రాంతాలుగా మారాయన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో రియల్ ఎస్టేట్ మరియు నిర్మాణరంగాల పాత్ర అని ఆయన ప్రశంసించారు.

29 వ రాష్ట్రాంగ ఆవిర్భవించిన తెలంగాణా రాష్ట్రం త్వరితగతిన పురోగతి సాధించడం స్వాగతించాల్సిన అంశమన్నారు. ఒక్క హైదరాబాద్ కే అభివృద్ధి ని పరిమితము చెయ్యకుండా రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలి అన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి భారత వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా పని చేయడం నుండి రాష్ట్రపతి భవన్‌లో పని చేయడం వరకు తన విభిన్న అనుభవాల గురించి మాట్లాడాతూ తెలంగాణ ప్రపంచస్థాయికి ఎదగడానికి ఎంతో సమయం పట్టదని ఆయన చెప్పారు. హైదరాబాద్ తో పాటు తెలంగాణాకు వృద్ధి రేటులో ప్రపంచ వ్యాప్త గుర్తింపు లనిస్తుందని ఆయన అన్నారు. హైదరాబాద్ స్థాయిని మరింత పెంచేందుకు ప్రభుత్వం అనేక వినూత్న చర్యలకు ప్రణాళికలు రూపొందిస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈప్రభుత్వం పారదర్శకంగా ఉంటుందని అందరికి అందుబాటులో ఉండి ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు పోతున్నదన్నారు. రాష్ట్రఅభివృద్ధికి అవరోధంగా ఉన్న అడ్డంకులు, తొలగించేందుకు సమిష్టి గా పనిచేస్తామని ఆయన చెప్పారు. పరిశ్రమలు లేవనెత్తిన ఆందోళనలను ఉద్దేశించి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, గ్రోత్ కారిడార్, పెరి అర్బన్ జోన్లలో బిల్డింగ్ కవరేజీ పరిమితులు, వ్యవసాయ లేఅవుట్‌లు మరియు జిహెచ్ఎంసితో సహా రాష్ట్రవ్యాప్తంగా జోనింగ్ నిబంధనలకు సంబంధించిన సమస్యలు న్యాయబద్ధమైనవని, వాటిని ఈ సమావేశంలో తీసుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో ఎనిమిది నెలల్లోనే తెలంగాణలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. పెను సవాల్ గా మారిన నిరుద్యోగ సమస్యను సమిసి పోయేలా చేసేందుకు అనేక మార్గాలలో చర్యలు చెప్పట్టామన్నారు.



ఉద్యోగ నియామక పోటీ పరీక్షల్లో అధికారులు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించడం లేదు.. పాటించేలా అధికారులను ఆదేశించాలని %ఎతీజూం% నాయకుడు మందకృష్ణ మాదిగ ఈరోజు ఉదయం ప్రజాభవన్ లో పోటీ పరీక్షల అభ్యర్థులతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి విజ్ఞప్తి చేశారు..మందకృష్ణ విజ్ఞప్తిని పరిశీలించిన డిప్యూటీ సీఎం సంబంధిత అధికారులతో మాట్లాడి రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

# సెక్రటేరియట్ లో తెలంగాణ తల్లి విగ్రహం డిసెంబర్ 9న ఏర్పాటు.

### పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : సెక్రటేరియట్ లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం నాడు విగ్రహ విగ్రహ ఏర్పాటు కోసం సెక్రటేరియట్ ఆవరణను పరిశీలించారు. డిసెంబర్ 9 వ తేదీన సచివాలయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి గతంలోనే ప్రకటించారు. రాజీవ్ గాంధీ జయంతి వేడుకలలో మరోసారి తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు అంశాన్ని సీఎం ప్రస్తావించారు. ఇందులో భాగంగా తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు సచివాలయ ఆవరణను సీఎం పరిశీలించారు. విగ్రహ ఏర్పాటు స్థలం, ఏరియా డిజైన్ ప్రణాళికలపై అధికారులతో చర్చించారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలని సీఎం సూచించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీ ఖాన్

# మూసీ రివర్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఎండీగా దానకిషోర్

### పలువురు ఐఏ ఎస్ అధికారుల బదిలీ

పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ ఎంసీ కమిషనర్ అమ్రపాలిని హెచ్ ఎండే జాయింట్ కమిషనర్ గా రిలీవ్ చేసింది. పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ కు మూసీ రివర్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఎండీగా నియమించింది. హెచ్ ఎండీ ఏ కమిషన్ సర్ఫరాజ్ అహ్మద్ను హైదరాబాద్ గ్రోత్ కారిడార్ ఎండీ గా నియమించింది.

వెయిటింగ్ లో ఉన్న ఛా హట్ బాజ్ పాల్ ను కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ గా నియమించింది. నారాయణ పేట అడిషన్ కలెక్టర్ (లోకల్ బాడీస్) మయాంక్ మిట్టల్ ను బదిలీ చేసి జలమండలి ఎక్జిక్యూటీవ్ డైరెక్టర్ గా నియమించింది.

# రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాలు అర్పించిన కాంగ్రెస్ నాయకులు



కూకట్ పల్లి ఆగస్టు 20 (వాస్తవ తెలంగాణ ) దివంగత భారత ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆసియాలో అతిపెద్ద కాలనీగా పేరొందిన కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీ ఫోరమ్ మాల్ కూడడి లో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్వే సత్యనారాయణ మరియు బండి రమేష్ మాట్లాడుతూ ఈ దేశంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చిన మహోన్నత యోధుడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ తన పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి భారత దేశ సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. భారతదేశ ప్రధానిగా రాజీవ్ గాంధీ ఆయన పాలనలో ఎన్నో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఈ దేశంలోని నిరుపేదలకు మేలు చేశాయని గుర్తు చేశారు. ఇందిర కుటుంబం దేశం కోసం బలిదానాలు చేశారని అలాంటి కుటుంబం సారాధ్యంలో కొనసాగుతున్న కాంగ్రెస్ పార్టీలో పనిచేయడం అదృష్టంగా భావించాలని అన్నారు. కార్యక్రమంలో టీపీపీసీ సత్యం శ్రీరంగం, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, బి బ్లాక్ ప్రెసిడెంట్ తూము వేణు, రేష్మమ్మ, ప్రవీణ్ కుమార్, పొన్నం రజిత, సంజీవరావు, స్టేట్ మహిళా నాయకురాలు పుష్ప రెడ్డి , యూత్ కాంగ్రెస్ సునీల్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అరవింద్ రెడ్డి, కృష్ణ రాజ్ పుత్, మేకల మైఖేల్, ఫణీంద్ర కుమార్, ప్రకాష్, గంధం రాజు,అక్బర్, నయీమ్, రాజా ముదిరాజ్, లుంగీ రాజు, శేషగిరిరావు, రంగస్వామి,శివ చౌదరి, సీనియర్ కాంగ్రెస్ మహిళా నాయకురాలు సంధ్యారాణి, మారుతి, యమునా,వనజ,రేణుక, లక్ష్మి, పద్మజ, వెంకటేశ్వరరావు, సోను, సూరిబాబు, దగ్గడు రాజు,పాలుగోన్నారు.

# దోమలు కుట్టకుండా మరియు పుట్టకుండా చూసుకోవాలి - ప్రిన్సిపాల్ డా. కె. హుస్సేన్




వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి :ప్రపంచ దోమల దినోత్సవం (ఆగస్టు 20) సందర్భంగా మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ప్రముఖ సూక్ష్మజీవ శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రాస్ మలేరియా దోమ వృద్ధి మరియు మలేరియా వ్యాధి వ్యాప్తిపై సమగ్ర పరిశోధనలు చేసి, ఫలితాన్ని కనుగొన్న రోజు గుర్తుగా ఈ దినోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో దోమల వల్ల వచ్చే వ్యాధులు, నివారణ, మరియు ముఖ్యంగా వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు గురించి అధ్యాపకులు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే హుస్సేన్ మాట్లాడుతూ దోమలు కుట్టకుండా మరియు పుట్టకుండా మనం జాగ్రత్త పడి అనేక రకాల జ్వరాల నుండి రక్షణ పొందవచ్చునని తెలియజేశారు. ఈ వర్షాకాలంలో దోమల వలన డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా, ఫైలేరియా వంటి వ్యాధులతో పాటు, ప్రత్యేకంగా ఎడిన్ ఈజిప్ట్ అను దోమ వలన రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా మెదక్ జిల్లాలోని పలు గ్రామాల్లో వేగంగా విష జ్వరాలు వ్యాపిస్తున్నాయి అని, కావున విద్యార్థిని, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జంతు శాస్త్ర విభాగాధిపతి ఎం వినోద్ కుమార్ సూచించారు. దోమల వల్ల కలిగే నష్టాలు, నివారణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐ క్యు ఏ సి కోఆర్డినేటర్ తిరుమల రెడ్డి, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ నాగేందర్ రావు, అధ్యాపకులు డాక్టర్ శరత్ రెడ్డి, శ్రీనివాస్, అంజయ్య, మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాపాడబోయిన వ్యక్తి ప్రాణం పోయింది

-హృదయ విధాకర ఘటన చిట్టాపూర్ లో జరిగింది





వాస్తవ తెలంగాణ న్యూస్, సిద్దిపేట జిల్లా బ్యూరో దుబ్బాక: రోడ్డు ప్రమాదంలో చిక్కుకున్న వ్యక్తులను కాపాడబోయిన వ్యక్తి ప్రాణం మీదకు తెచ్చుకున్న హృదయ విధాకర ఘటన సిద్దిపేట జిల్లా అక్బర్పేట, భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామంలో జరిగింది. టీఎస్06యూబీ3686 నెంబర్ గల కారు సోమవారం రాత్రి రామాయంపేట నుంచి సిద్దిపేటకు వెళ్తంది. ఇర్కోటి రామాగౌడ్ ఇంటి ముందు ఉన్న డివైడర్ను ప్రమాదవశాత్తు ఢీకొని కారు బోల్తా పడింది. ప్రమాద సమయంలో అక్కడే ఉన్న రామాగౌడ్, ఆయన మనుమడు అరవిందు కలిసి కారు డోర్లను తీసి అందులో ఉన్న వాళ్లను బయటకు తీస్తున్నారు. కారులోంచి బయటకొచ్చిన అమూల్య, సిరి చందన, రామాగౌడ్, అరవిందను సిద్దిపేటకు అతివేగంగా వెళ్తన్న ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో రామాగౌడ్ అక్కడికక్కడే మరణించగా అమూల్య, సిరి చందన, అరవిందకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అమూల్య, సిరి చందన, అరవిందను ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంలో పాడబోయిన రామాగౌడ్ మరణించడం గ్రామంలో పండుగ పూట విషాధం నెలకొంది. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు భూంపల్లి ఎస్ఐ హరీష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వ పరిపాలన విధానం పట్ల సంపూర్ణ అవగాహన కలిగిన ప్రముఖుల సమావేశం



సదాశివపేట వాస్తు తెలంగాణ న్యూస్:సంగారెడ్డి జిల్లా సదాశివపేట బీసీవై పార్టీ జిల్లా ఇన్చార్జ్ న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ సికింద్రాబాద్, పారడైజ్ పీజీ కళాశాల ప్రాంగణంలో ఏకమైన ప్రభుత్వ పరిపాలన విధానం పట్ల సంపూర్ణ అవగాహన కలిగిన ప్రముఖుల సమావేశంలో పాల్గొన్న బీసీవై పార్టీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ముందు బంగారు భవిష్యత్తు కాలం ఉందని త్వరలో కేంద్ర మరియు రాష్ట్ర ప్రముఖ ప్రముఖ నాయకులతో సెప్టెంబర్ నెలలో కలిసి అభివృద్ధి పదం గురించి ఆలోచించి మంచి మార్పులు తీసుకొస్తామని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని సాధిస్తామని తెలియజేశారు. ఈ యొక్క సమావేశంలో రవి కిరణ్ మోహన్ రాజేష్ మాధవి సోనీ ఎన్ రాజేష్ మరియు ప్రముఖ వేధావులు పాల్గొన్నారు.

## చందిప్ప శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయాన్ని దర్శించుకున్న సీరియల్ యాక్టర్ లక్ష్మి




శంకర్పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్:శంకర్పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11 వ శతాబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో మంగళవారం సీరియల్ యాక్టర్ లక్ష్మి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన పూజారి సాయి శివ ఆమెకు తీర్థప్రసాదాలు అందజేశారు. మరకత లింగాన్ని దర్శించుకోవడం తన జన్మ ధన్యమైందని ఆమె అన్నారు. ఆల్ ఇండియా చైర్మన్ దయాకర్ రాజు ఆలయ చైర్మన్ గోపాల్ రెడ్డి, సదానందం గౌడ్ ఆమెకు స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు.

# నేడు దశరథి కృష్ణమాచార్య శతజయంతి వేడుకలు.




సంగారెడ్డి వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి టీ మాణిక్యం. సంగారెడ్డి పట్టణంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 21వ తేదీన ఉదయం 10 గంటలకు దశరథి కృష్ణమాచార్య శతజయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రత్న ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ హాజరవుతారని ఆయన తెలిపారు . విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# పాటల సిడిని ఆవిష్కరించిన నీలం మధు



పటాన్చెరు,వాస్తవ తెలంగాణ న్యూస్:సంగారెడ్డి జిల్లా పటాన్చెరువు మండలం చిట్కుల్ గ్రామంలో ప్రముఖ నేపథ్యగాయని మధుప్రియ రేలారే ప్రసాద్ రచనలు రూపొందించిన బహుజనులకు బలం పేదోళ్ల బంధువే నీలం మదన్న అనే పాటల సిడిని నీలం మధు ముదిరాజ్ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. అద్భుతంగా పాటలను ఆలపించిన మధుప్రియను నీలం మధు ముదిరజ్ అభినందించారు. కార్యక్రమంలో యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు పూర్వ భద్ర నక్షత్ర వేడుకలు.




సంగారెడ్డి వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి టీ మాణిక్యం. సంగారెడ్డి పట్టణంలోని బ్రాహ్మణవాడలోని పురాతన నట్టి అనుమానం మందిరంలో ఈ నెల 21వ తేదీన పూర్వభద్ర నక్షత్ర వేడుకలు ఘనంగానే నిర్వహిస్తున్నట్లు దేవాలయ అర్చకులు సభాపతి శ్రీ శివశర్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు హనుమంతునికి సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. పూర్వాషాడ భద్రత నక్షత్ర వేడుకలకు దాతలు ఇచ్చేటటువంటి అభిషేకానికి సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని దేవాలయ అర్చకులు సభాపతి శివశర్మ తెలిపారు.

# మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్ష రక్షాబంధన్




వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి: వృక్షో రక్షతి రక్షితఃలి అనే సూత్రాన్ని అనుసరిస్తూ, రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్ లో వృక్ష రక్షాబంధన్ అనే వినూత్న కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం వృక్షశాస్త్ర విభాగం మరియు క్లైమేట్ స్మార్ట్ గ్రీన్ ఎకో క్లబ్ ఆధ్వర్యంలో, వృక్ష శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ నాగేందర్ రావు మరియు క్లబ్ చైర్మన్ డాక్టర్ శ్రీలత నాయకత్వంలో జరిగింది అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. హుస్సేన్ .తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, వృక్షాలను రక్షించడం ద్వారా మనం ప్రకృతిని, మరియు మన జీవితాలను కూడా రక్షించగలమనే గొప్ప సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో, విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో ఉన్న వృక్షాలకు రక్షాబంధన్ కట్టి, వాటిని సంరక్షిస్తామని, మరియు సృష్టిలోని ప్రతి ప్రాణికి, ప్రతి దశలో అండగా నిలుస్తూ ఆహారం, ఇతర అవసరాలను తీర్చుతున్న వృక్షాలకు రక్షించడము మా బాధ్యత అని ప్రతిజ్ఞ చేశారు. వృక్ష శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ నాగేందర్ రావు .వృక్షాలను కాపాడడం ద్వారా పర్యావరణాన్ని సమర్థవంతంగా రక్షించగలమనే సందేశాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో, ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ తిరుమల రెడ్డి వృక్షశాస్త్ర విభాగ అధ్యాపకులు డాక్టర్ రాజు మరియు కళాశాల విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణ పట్ల యువతరం బాధ్యతను పెంపొందించడానికి ఒక గొప్ప వేదికగా నిలిచింది.

# వెన్నెల గడ్డలోని ఈ ఆర్ ఓ ఫీస్ నందు ధర్నా చేసిన కాలనీవాసులు



కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి:జీడిమెట్ల డివిజన్ పరిది లోని 8 కాలనీలో గత 6 నెలలుగా తలెత్తిన విద్యుత్ సరఫరా లో అంతరాయం గురించి ఈరోజు డివిజన్ నాయకులు వెన్నెల గడ్డ లోని ఈ ఆర్ ఓ ఆఫీస్ నందు ధర్నా చేపట్టడం జరిగింది. గత ఆరు నెలలుగా సాయిబాబా నగర్ ఫీడర్ ఛానల్ నుండి సరఫరా జరిగే 8 కాలనీలలో ప్రతిరోజు దాదాపుగా రెండు గంటల పాటు రాత్రి పగలు తేడా లేకుండా విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుంది. ఇట్టి విషయాన్ని అధికారులకు పలుమార్లు వివరించిన వారు ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించినందుకు నిరసనగా ఈరోజు 8 కాలనీల అసోసియేషన్ సభ్యులు ఈ ఆర్ ఓ ఆఫీస్ చేరుకొని ధర్నా నిర్వహించడం జరిగింది. ధర్నా అనంతరం డి. ఈ. శ్రీనాథ్ రెడ్డి ని కలిసి సమస్యలను వివరించి వెంటనే పరిష్కరించాలని వినతిపత్రం అందజేయడం జరిగింది. ఇందుకు గాను డి .ఈ . శ్రీనాథ్ రెడ్డి సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడి ఇట్టి సమస్యకు కారణమైన వారి పైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది మరియు అతి త్వరలో ఇట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఎం.ఎన్.రెడ్డి కాలనీ ఫేస్ వన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సూదుల సంపత్ గౌడ్, బ్యాంక్ కాలనీ అధ్యక్షులు సుధాకర్ గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, న్యూ వివేకానంద నగర్ మాజీ ప్రెసిడెంట్ సత్తయ్య గౌడ్, ఎల్లా గౌడ్, బలరాం, పరమేష్ నాయీ , శంకరయ్య, అంజయ్య, రవీందర్ గౌడ్, సత్యారాం, రామాంజనేయులు, సంతోష్, డీజే ప్రసాద్, మాలాద్రి, నజీర్, నవీన్ రెడ్డి, మహేష్ గౌడ్, రమేష్, బాలరాజ్ మరియు వివిధ కాలనీ లా అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి మహిళల ఫుట్బాల్ రన్నర్ గా మెదక్ జిల్లా జట్టు. ఎంపికైనట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు.



వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి :మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టును జిల్లాతెలంగాణ ఫుట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుండి 20వ తేదీ వరకు నిజాంబాద్ లో జరిగిన రాష్ట్రస్థాయి మహిళల ఫుట్బాల్ ఛాంపియన్షిప్ లో రన్నరపుగా నిలిచిన ఉమ్మడి మెదక్ జిల్లా జట్టును జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తన చాంబర్లో క్రీడాకారులను,వీరితోపాటు జాతీయస్థాయిలో జూనియర్ ఫుట్బాల్ విభాగంలో బంగారు పథకం సాధించిన అంకిత్ ను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యం కల్పిస్తుంది అన్నారు .మెద క్ లోని ఇందిరాగాంధీ స్టేడియం మరమ్మత్తులను ఇప్పటికే పూర్తి చేసి ఫుట్బాల్ క్రీడా మైదానాన్ని క్రీడాకారులకు అందుబాటులో తీసుకొచ్చామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జాతీయస్థాయిలో రాణించాలన్నారు. ఈ మధ్యనే క్రీడాకారుల అభ్యర్థుల మేరకు ఫుట్బాల్ మైదానం లెవలింగ్ చేయిస్తున్నట్లు వివరించారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుండి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న నగేష్ సంయుక్త కార్యదర్శి, శిక్షకులు ప్రకాష్, భాగ్యమ్మ, వినయ్ , బాణి మరియు ఫుట్బాల్ అకాడమీ సభ్యులందరినీ కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు.



# జాతీయ రహదారిపై చెట్లను పెంచడమే లక్ష్యంగా నేషనల్ హైవే అథారిటీ...



తూప్రాన్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి : జిమ్మెర్ పోచంపల్లి ఎక్స్‌ప్రెస్ వేస్ లిమిటడ్ మరియు జిమ్మెర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వన మహోత్సవం కేంద్ర ప్రభుత్వం, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద మియావాకీ ప్లాంటేషన్ మరియు మాసివ్ ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమం యొక్క బ్యానర్ ను నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు మరియు జి.యం.ఆర్ హైవేస్ హెడ్ శంకర్ గణేశన్, ఎమ్మెస్ వి ఇండిపెండెంట్ ఇంజనీర్ హాజ్రాత్ రెడ్డి, జిమ్మెర్ హైవేస్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ,చేతులమీదుగా ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా మహాత్మ జ్యోతి బాపులే మరియు సాంఘిక సంక్షేమ విద్యాలయాల విద్యార్థులచే నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు మరియు జి.యం.ఆర్ హైవేస్ హెడ్ శంకర్ గణేశన్ మరియు ఎమ్మెస్ వి ఇండిపెండెంట్ ఇంజనీర్ హాజ్రాత్ రెడ్డి, జిమ్మెర్ హైవేస్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ,ఇతర ప్రతినిధులకు, అధికారులకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం మొక్కలను నాటడడం జరిగినది. ఈ సందర్భంగా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ నేషనల్ హైవేలను గ్రీన్ కవర్‌తో నింపే దృక్పథాన్ని సాకారం చేసేందుకు, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా వివిధ ప్రదేశాలలో జాతీయ రహదారులకు ఆనుకుని ఉన్న ల్యాండ్ పార్శిల్స్‌లో మియావాకీ ప్లాంటేషన్‌ను నాటడానికి ఒక ప్రత్యేక చొరవ తీసుకుంటుంది. మియావాకీ ప్లాంటేషన్లను స్థాపించడానికి వివిధ ప్రదేశాలలో 53 ఎకరాలకు పైగా మొత్తం భూభాగాన్ని గుర్తించారు. జాతీయ రహదారులన్నిటిని గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేస్ గా మార్చడమే మా లక్ష్యం అని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన జి.యం.ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ ని ఉద్దేశించి మాట్లాడుతూ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా మరియు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను అనుసరించి అనేక కార్యక్రమాలను జి.యం.ఆర్ పోచంపల్లి హైవేస్ మరియు జి.యం.ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ద్వారా అద్భుతంగా నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలపడం జరిగింది. జి.యం.ఆర్ హైవేస్ హెడ్ శంకర్ గణేషన్ మాట్లాడుతూ పరిశ్రమల వల్ల మరియు అధిక సంఖ్యలో వాహనాలు వాడడం వల్ల వాతావరణ కాలుష్యం జరిగి భూమి మీద అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం జరుగుతుంది మరియు పీల్చుకోవడానికి స్వచ్ఛమైన గాలి లభించక అనేకమంది శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడడం జరుగుతుంది. దీనిని నివారించడానికి భారతదేశంలో గల అన్ని జాతీయ రహదారులను గ్రీన్ ఫీల్డ్ హైవేస్ గా మార్చాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలపడం జరిగింది. ఈ సందర్భగా ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, భూ మండలంలోని సమస్త ప్రాణుల జీవన మనుగడకు చెట్లే ఆధారం అన్నారు. భవిష్యత్ తరాలకు ఇబ్బందులు రాకుండా ఉండాలి అంటే మనిషికి ఒక మొక్క నాటడంతో పాటు మొక్కలను సంరక్షిస్తూ పెంపకాల బాధ్యతలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల సంస్థ ప్రతినిదులు, జిమ్మెర్ పోచంపల్లి హైవేస్ ప్రతినిదులు, రక్ష సిబ్బంది, పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నేత కూన శ్రీశైలం గౌడ్






కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు:కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని, స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొని శ్రీ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దేశ ప్రధానిగా రాజీవ్ గాంధీ చేసిన సేవలను ఆయన కొనియాడారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు తీసుకొచ్చేందుకు ఆయన ఎంతగానో కృషి చేసారని, వయోజన ఓటు హక్కును 21 ఏండ్ల నుండి 18 ఎండ్లకి తగ్గించిన ఘనత శ్రీ రాజీవ్ గాంధీదని అన్నారు. టెలికాం, కంప్యూటరైజెన్ రంగాలలో రాజీవ్ గాంధీ విశేష కృషి చేసారని, సాంకేతిక రంగ అభివృద్ధికి పాటుపడ్డారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగానే ఉందని, ఆ మహనీయుని ఆశయాల సాధనకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, నిజాంపేట్ కార్పొరేటర్ ఏనుగు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పాల కృష్ణ, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు లాయక్, పండరి, బేకు శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దమ్మని శ్రవణ్ కుమార్, బుచ్చిరెడ్డి, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, ఓరుగంటి కృష్ణా గౌడ్, జయరాం, కూన రఘు గౌడ్, రషీద్ బేగ్, రషీద్, మోతె శ్రీనివాస్ యాదవ్, కృష్ణ యాదవ్, వెంకట్, బాలప్ప, రమేష్ మంజుల్కర్, యాము, ప్రభాకర్ రెడ్డి, మధు, వి. అరుణ్, నేమూరి రమేష్ గౌడ్, గొట్టి రమణ, విజయ్ గుప్తా, అజయ్, సుశాంత్ గౌడ్, ఖాజా భాయ్, లాల్ మహ్మద్, షాకీర్, రామకృష్ణ రెడ్డి, రాజిరెడ్డి, తౌసీఫ్, జహంగీర్, చోటు, పలువురు మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డిని కలసిన రాష్ట్ర ఫెడరేషన్ బృందం



కూకట్ పల్లి , ఆగస్ట 20, వాస్తవ తెలంగాణ:తెలంగాణ రాష్ట్రం బోరబండ పోలీసులు న్యాయవాది సంతోష్ పై దాడి చేసిన ఘటనపై అడ్వకేట్ జనరల్ కి వై. కొండల్ రెడ్డి బృందం ఫిర్యాదు చేశారు. ఇట్టి ఈ అంశంపై అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి సానుకూలంగా స్పందించి రేపు తెలంగాణ హైకోర్టు పరిధిలో ప్రధాన న్యాయమూర్తి దగ్గర సుమోటోగా రిట్ పిటిషన్ స్వీకరించబడుతుందని తెలిపారు. ఈ అంశంపై హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ. రవీందర్ రెడ్డి తెలంగాణ ప్రధాన న్యాయమూర్తి దగ్గర ఈ ఘటనపై విన్నవించడం జరిగింది. ఈ అంశంపై విచారణ జరగనుందని అడ్వకేట్ జనరల్ తెలిపారు. ఈ అంశంపై తెలంగాణ అడ్వకేట్ జనరల్ ఏ.సుదర్శన్ రెడ్డి, హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.రవీందర్ రెడ్డి కి వై .కొండల్ రెడ్డి వారి బృందం తెలంగాణ న్యాయవాదులు బార్ అసోసియేషన్ల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

# ఆధునిక సాంకేతికతకు ఆద్యుడు రాజీవ్ గాంధీ



పటాన్చెరు,వాస్తవ తెలంగాణ న్యూస్:ఆధునిక సాంకేతికకు ఆధ్యుడు రాజీవ్ గాంధీ అని మెదక్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు అన్నారు. పటాన్ చెరు మండలంలోని చిటకుల్ క్యాంపు కార్యాలయంలో రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంగళవారం పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నేటి నుంచి విద్యార్థులకు మండల స్థాయి క్రీడలు.



సంగారెడ్డి వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి టీ మాణిక్యం. సంగారెడ్డి జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకు మండల స్థాయి క్రీడలు అన్ని మండలాల్లో నిర్వహించాలని జిల్లా అధికారి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోకో, కబడ్డీ, వాలీబాల్, బాల బాలికలకు అండర్ 14, 17 పోటీలు నిర్వహించాలని తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయిలో పోటీలకు ఎంపిక చేయాలని పేర్కొన్నారు.

# శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహా ప్రతిష్ట కార్యక్రమం





కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి:కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 126 జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి షిర్డీ హిల్స్ అంజయ్య నగర్ లో ఆలయ చైర్మన్ ఆడెపు నాగరాజు ఆలయం లో నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహా ప్రతిష్ట కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి. ఈ కార్యక్రమం లో డివిజన్ అధ్యక్షులు పున్నారెడ్డి, మహేందర్, హనుమంత్, రమేష్, ప్రవీణ్ గుప్తా, పి.ఎల్ ప్రసాద్, రవి ముప్పడి, తిరుపతి గౌడ్, నార్లకంటి దుర్గయ్య,శ్రవణ్, శివ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు

# లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, చెక్కుల పంపిణి చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్



పటాన్చెరు,వాస్తవ తెలంగాణ న్యూస్:సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ మున్సిపల్, మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 57 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన 57 లక్షల రూపాయలు చెక్కులను పంపిణీ చేసిన పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి . హాజరైన మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, ఎమ్మార్వో రాధ, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్స్ సభ్యులు.

# ఘనంగా రాజీవ్ గాంధీ 80 వ జయంతి వేడుకలు




రామగుండం,వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి రాజు:మంగళవారం రోజు స్థానిక జిఎం ఆఫీస్ వద్దగల రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బొంతల రాజేష్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ 80వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ ముఖ్యఅతిథిగా వారి చేతుల మీదుగా రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ....తన చివరి ఊపిరి ఉన్నంత వరకు దేశం కోసం ప్రాణాలు అర్పించిన అవిశ్రాంత ధీరుడు,నిరుపేదలకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడు, గాంధీ వారసత్వాన్ని పుచ్చుకొనిదేశాన్ని ప్రగతి బాటలో నడిపిన అజరామరుడు,సాంకేతిక విప్లవం ద్వారా భారతదేశాన్ని ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా పునాదులు వేసిన మేధావి,వారి ఆశయ సాధనకై పునరంకితం కావాలని,ఐటి రంగంలో ప్రపంచ దేశాలతో పోటీ పడి మున్ముందుకు సాగిపోవాలని, మాజీ ప్రధాని శ్రీ రాజీవ్ గాంధీ జయంతి నివాళులు అర్పిస్తూ మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు రామగుండం మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, కలవ లింగస్వామి, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, దిటి బాలరాజు, ముస్తఫా, గట్ల రమేష్, బాల రాజ్ కుమార్, పెద్దల్లి ప్రకాష్, బొమ్మక రాజేష్, కొప్పుల శంకర్, నాయిని ఓదెలు, యుగేందర్, సింహాచలం, చుక్కల శ్రీనివాస్, కలవల సంజీవ్, దొంత శ్రీనివాస్, శంకర్ నాయక్, సలీం బేగ్, నజీముద్దీన్, దాసరి ఉమా సాంబమూర్తి, మాలెం మధు, బాబుమియా, దాసరి విజయ్, హనుమ సత్యనారాయణ, గుండేటి శంకర్, ఆడెపు రవి, రాజ్ కుమార్, చెరుకు బుచ్చిరెడ్డి, పంజా శ్రీనివాస్, ముస్తఫా, చెప్పరి శ్రీనివాస్, బొంతల లచ్చన్న, మీసాల సతీష్, వెంకటరమణ నారాయణ, ప్రవీణ్, సురేష్, కంకణాల రాజు, నాంపల్లి, తదితరులు అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అజ్ఞాత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వస్తే స్పందించవద్దు:దుబ్బాక సిఐ శ్రీనివాస్



దుబ్బాక,వాస్తవ తెలంగాణ న్యూస్:అజ్ఞాత వ్యక్తుల నుంచి మీకు డ్రగ్స్ పార్సిల్స్ వచ్చాయంటూ, డ్రగ్స్ వాడుతూ మీ కుటుంబ సభ్యులు పోలీసులకు పట్టుబడినట్లు ఎవరికైనా ఫేక్ ఫోన్ కాల్స్ వస్తే స్పందించవద్దని, తక్షణమే స్థానిక పోలీసులను గాని, టోల్ ఫ్రీ నెంబర్ 1930కు గాని సంప్రదించాలని దుబ్బాక సిఐ పాలెపు శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం దుబ్బాక సిఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సైబర్ మోసాలకు ఎంతోమంది అమాయకులు బలవుతున్నారన్నారు. సైబర్ నేరగాళ్లు మీ కుటుంబ సభ్యులు, బంధువులు డ్రగ్స్ సరఫరా చేస్తూ దొరికిపోయారని, డ్రగ్స్ పార్సిల్స్ మీ పేరుపై వచ్చాయంటూ తెలియని ఫోన్ నంబర్స్ నుంచి చేస్తున్న ఫేక్ ఫోన్ కాల్స్ కు భయపడవద్దని, వారి ఫోన్ కాల్స్ కు స్పందించవద్దన్నారు. సైబర్ మోసగాళ్లు ఏ మాత్రం అనుమానం రాకుండా పోలీసుల మంటూ నకిలీ ఐడి కార్డులు, ఫేక్ ఎఫ్ఐఆర్ కాపీలను సృష్టించి, పలువురు బాధితుల ఫోన్లకు పంపిస్తూ, వారిని భయభ్రాంతులకు గురిచేసి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని, వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దానితోపాటు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ, ఇంట్లోనే ఉండి ఉద్యోగం చేసుకుంటూ లక్షలు సంపాదించవచ్చంటూ, షేర్ మార్కెట్లో పెట్టుబడి పెడితే అతి తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు వస్తాయంటూ వచ్చే మోసపూరిత ఫోన్ కాల్స్ కు స్పందించవద్దని కోరారు. ఎవరైనా ఇలాంటి మోసాలకు గురైతే తక్షణమే స్థానిక పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని సూచించారు.

# జర్నలిస్టు రాజును పరామర్శించిన సామాజిక సేవకురాలు మహమ్మద్ సుల్తానా ఉమర్



వాస్తవ తెలంగాణ సిద్దిపేట జిల్లా బ్యూరో: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజాసేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్, కోశాధికారి మహమ్మద్ ఉమర్, సీనియర్ జర్నలిస్ట్ బండ నర్సింలు మంగళవారం సిద్దిపేట ప్రైవేట్ హాస్పిటల్ చికిత్స పొందుతున్న రాజును పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఆస్క రాజు ఎదురుగా అతివేగంగా అజాగ్రత్తగా వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. ఈ రోడ్డు ప్రమాదంలో రాజుకు కుడి కాలుకు తీవ్ర గాయాలు కాగా రెండు చోట్ల కాలు విరిగింది. వైద్యులు సోమవారం రాజుకు శస్త్ర చికిత్స నిర్వహించారు. ప్రస్తుతం రాజు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యుల సలహా మేరకు పూర్తిగా కోలుకునేంతవరకు చికిత్స తీసుకోవాలని ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# ప్రభుత్వ పాఠశాలలో వ్యాసరచన పోటీలు.




సంగారెడ్డి వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి టీ మాణిక్యం. సంగారెడ్డి లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వతంత్రదినోత్సవం పురస్కరించుకొని లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన, ఉపన్యాస క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ మంగలపర్తి వెంకటేశం ప్రశంస పత్రాలను జ్ఞాపకాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చిన్న వయసు నుండి ఉపన్యాసం వ్యాసరచన పోటీలను అవగాహన ఉండేలా చేయాలని ఉపాధ్యాయులు వారికి సహకరించాలని కోరారు. ప్రతి పాఠశాలలో నెల గాని రెండు నెలలకు ఒకసారి గానీ ఫీజు మరియు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లయితే పిల్లలకు మేధాశక్తి అరాళంగా మాట్లాడే శక్తి వస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో ఉపాధ్యాయురాలు శోభ రాణి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# సంపూర్ణ రుణ మాఫీ సాధన కార్యాచరణ



సిద్దిపేట,వాస్తవ తెలంగాణ న్యూస్:సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో సంపూర్ణ రుణ మాఫీ సాధన కార్యాచరణ సమావేశం హాజరైన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ , మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, దేవి ప్రసాద్ , ప్రతాప్ రెడ్డి , ఎర్రోళ్ల శ్రీనివాస్ ఫారూక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.అబద్ధపు హామీలు మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంనిది అని పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు.– రైతులకు మేలు చేయాలని సంకల్పంతోనే రెండు లక్షల రుణమాఫీ చేయించేందుకు సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు రాజీనామా సవాల్ విసిరారని, దేవుళ్ళ మీద ఒట్లు వేసి పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొంది 31 వేలకు కోట్లగాను,?17,000 కోట్ల రుణమాఫీ చేసి రాజీనామా చేయాలని ముఖ్యమంత్రి మాట్లాడడం సరికాదన్నారు.– సీఎం కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంటు ప్రతి ఇంటికి నల్ల కలెక్షన్ తో ఆడబిడ్డలను ఆత్మ గౌరవంతో బతికేలా కాపాడిన నాయకుడు కేసీఆర్ అన్నారు.– రుణమాఫీ ఎంత మంది రైతులకు అయిందో గ్రామాలకు చూస్తే తెలుస్తుందని మొత్తం రుణమాఫీ చేసేదాకా ఈ ప్రభుత్వాన్ని నిర్వహిస్తామన్నారు. 50 మంది 50 శాతం మంది రైతులకు రుణమాఫీ చేయలేదని అన్నారు. పిల్లలకు మహాలక్ష్మి పేరట ఇస్తానన్న 2500 రూపాయలు పూసే ఎత్తడం లేదన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యను నిర్వహణకు కనీసం అధికారులతో సమీక్ష నిర్వహించలేదని ఎద్దేవా చేశారు రైతులు పెన్షనర్లు ప్రజలు ఇలా అన్ని వర్గాలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పాలల్లో అభివృద్ధి కొంటుపడిందన్నారు అన్నారు.– ప్రశాంతంగా ఉన్న సిద్దిపేటను చిచ్చుపెట్టేందుకు దాడుల సంస్కృతి తినలేకరని దానికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు అన్నారు.– దాడుల వెనుక సీఎం రేవంత్ రెడ్డి హస్తం ఉంటే రేపు జరగబోయే పరిణామాలకు సీఎం బాధ్యత వహించాలన్నారు.

# రైతును రాజును చెయ్యడం కాంగ్రెస్ కే సాధ్యం

**– రైతు రుణమాఫీ చరిత్రాత్మకం**

**– "హైడ్రా" పర్యావరణానికి రక్షణ**

**–చెరువులు, కాలువల పునరుద్ధరణతో తీరనున్న వరద కష్టాలు, విపత్తులు పెరగనున్న మత్స్య సంపద**



పటాన్ చెరు మెట్రోతో తీరనున్న రవాణా కష్టాలు ప్రజలకు మంచి చేస్తున్న సీఎం రేవంత్ కు రుణపడి ఉంటాం నీలం మధు ముదిరాజ్ ముఖ్యమంత్రి రేవంత్ ని హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిసి ధన్యవాదాలు తెలిపిన నీలంరైతును రాజును చేయడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు.తెలంగాణలో రైతాంగానికి 2 లక్షల రుణమాఫీ చేయడంతో పాటు ప్రకృతి పరిరక్షణకు, విపత్తుల నివారణకు హైడ్రా ఏర్పాటు, పటాన్ చెరు వరకు మెట్రో రైల్ నిర్మాణానికి నిధులు కేటాయించిన సందర్భంగా నీలం మధు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా పూల బోకే ఇచ్చి ఘనంగా సత్కరించారు.అనంతరం నీలం మధు మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న రైతు రుణమాఫీ దేశంలోనే చారిత్రాత్మక నిర్ణయమన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రైతు సంక్షేమానికి పాటుపడుతూ రైతును అప్పుల ఉబి నుంచి బయటపడేస్తూ రైతుల కళ్ళలో ఆనందం చూడడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నాడని కొనియాడారు. ఒకే విడతలు రెండు లక్షల రైతు రుణమాఫీ చేయడం చరిత్రలో మొదటి సారన్నారు. రైతు రుణమాఫీతో ఒక ఘట్టం పూర్తయిందని రానున్న రోజుల్లో రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించి రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతామని స్పష్టంచేశారు. రైతుల కోసం పనిచేస్తున్న రైతు పక్షపాతి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతుల దీవెనలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకృతి పరిరక్షణ, విపత్తులను ఎదుర్కోవడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన 'హైడ్రా' పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. మహానగరంలో కబ్జాలకు గురైన చెరువులు వరద కాలువలు పునరుద్ధరణతో మహానగరంలో మళ్లీ మంచి రోజులు రాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. హైడ్రాకు స్వయం ప్రతిపత్తి కల్పించి ప్రకృతి పరిరక్షణకు ముఖ్యమంత్రి తీసుకుంటున్న నిర్ణయాలు భవిష్యత్తు తరాలకు సోపానాలుగా అభిప్రాయపడ్డారు. హైడ్రాతో చెరువులను పునరుద్ధరిస్తే చెరువుల్లో మత్స్య సంపద పెరుగుతుందని వివరించారు.అదేవిధంగా పటాన్ చెరు వరకు నిర్మించదలచిన మెట్రో నిర్మాణానికి బడ్జెట్ లో నిధులు కేటాయించడం పట్ల నీలం మధు ఆనందం వ్యక్తం చేశారు. పటాన్ చెరు వరకు మెట్రో పొడిగింపుతో ఈ ప్రాంతంలో పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులతో పాటు ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం లభిస్తుందన్నారు. పటాన్ చెరు మెట్రో కలను సాకారం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ ప్రాంత ప్రజలంతా రుణపడి ఉంటారని తెలిపారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ జన్మదిన వేడుకలు

**–పేద విద్యార్థులకు పండ్లు పంపిణి**





వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి:దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ జన్మదిన వేడుకలు పాపన్నపేట మండలం అన్నారం గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా టిపిసిసి ఎస్సి సెఎల్ కన్వీనర్ సల్మాన్ రాజ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థులకు పండ్లు పంపించేశారు. సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అయన మాట్లాడుతూ దేశంలో టెక్నాలజీని తీసుకొచ్చింది రాజీవ్ గాంధీ అని కొనియాడారు. దేశం కోసం రాజీవ్ గాంధీ తన ప్రాణాలర్పించాలన్నారు. రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం పనిచేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారులు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాల ప్రవేశపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నీలం మధు ట్రస్టు సభ్యులు, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఇస్మాయిల్, యువజన కాంగ్రెస్ నాయకులు రవి, ఎస్టీ సెల్ అధ్యక్షులు చందర్, ఉపాధ్యక్షులు దేవరాజ్, మాజీ ఎంపీటీసీ ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

# అక్బర్ పేటలో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



వాస్తవ తెలంగాణ సిద్దిపేట జిల్లా బ్యూరో: అక్బర్ పేట భూంపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి , భారతరత్న శ్రీ రాజీవ్ గాంధీ 80 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ కార్యక్రమంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, పోతారెడ్డిపేట తాజా మాజీ ఎంపీటీసీ మంద చంద్రసాగర్, మాజీ టెలికం బోర్డు మెంబర్ పాతూరి శ్రీనివాస్ గౌడ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పల్లె అనిల్,అక్బర్ పేట గ్రామ అధ్యక్షుడు కూతురి చందు,భూంపల్లి గ్రామ అధ్యక్షుడు ఎల్లన్న గారి సురేందర్ రెడ్డి, బేగంపేట గ్రామ అధ్యక్షుడు ఉద్ధమారి సతీష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బత్తే వెంకటేశం, షేర్ పల్లి స్వామి, ఉద్ధమారి నవీన్, పుల్లని ఎల్లయ్య, పొట్టేల స్వామి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు.



సంగారెడ్డి వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిది: సంగారెడ్డి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజు పార్క్ లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీజీఐ ఐ సి చైర్మన్ నిర్మల రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం రాజీవ్ గాంధీ త్యాగం చేశారని తెలిపారు. రాజీవ్ గాంధీ భారతదేశం కోసం ఎన్నో త్యాగాలు చేసి ఐటి, టెలికం రంగాల పితామహుడు మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ అని ఆమె తెలిపారు. పయనీర్ ఆఫ్ డిజిటల్ ఇండియా కంప్యూటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా అని కూడా ఆయనను పిలుస్తారు. ఆయన ఆయంలోనే దేశంలో ఐటీ టెలికం విప్లమాత్మక పునాదులు పడ్డాయని 21 శతాబ్దంలో దేశాన్ని కొత్త దిశగా నడిపించి దేశ నిర్దేశం చేశారని ఆమె తెలిపారు. భారతదేశాన్ని ఏడవ ప్రధానమంత్రిగా 1984 నుంచి 1989 వరకు సేవలందించారు తనకు ఇష్టమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ దృష్టి పెట్టి దేశాన్ని అంతర్జాతీయ స్థాయిలో ఎదిగేలా చేశారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టి సి సి , కార్యదర్శి తో పాజి అనంత కిషన్, ఏదైనా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సంతోష్, పట్టణ అధ్యక్షుడు జార్జి, నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పరిపాలన విధానం పట్ల సంపూర్ణ అవగాహన కలిగిన ప్రముఖుల సమావేశం



సదాశివపేట వాస్తు తెలంగాణ న్యూస్:సంగారెడ్డి జిల్లా సదాశివపేట బీసీవై పార్టీ జిల్లా ఇన్చార్జ్ న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ సికింద్రాబాద్, పారడైజ్ పీజీ కళాశాల ప్రాంగణంలో ఏకమైన ప్రభుత్వ పరిపాలన విధానం పట్ల సంపూర్ణ అవగాహన కలిగిన ప్రముఖుల సమావేశంలో పాల్గొన్న బీసీవై పార్టీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ముందు బంగారు భవిష్యత్తు కాలం ఉందని త్వరలో కేంద్ర మరియు రాష్ట్ర ప్రముఖ ప్రముఖ నాయకులతో సెప్టెంబర్ నెలలో కలిసి అభివృద్ధి పదం గురించి ఆలోచించి మంచి మార్పులు తీసుకొస్తామని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని సాధిస్తామని తెలియజేశారు. ఈ యొక్క సమావేశంలో రవి కిరణ్ మోహన్ రాజేష్ మాధవి సోనీ ఎన్ రాజేష్ మరియు ప్రముఖ మేధావులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో మరోసారి చిరుత కలకలం

శ్రీశైలంలో మరోసారి చిరుత సంచారం కలకలం రేపుతోంది. నీలం సంజీవరెడ్డి నిలయం గేటు దగ్గర చిరుత పులి కనిపించింది. చిరుత పులిని చూసి భక్తులు భయాందోళనకు గురైయ్యారు.

కారు లైట్లు వేయడంతో అడవి ప్రాంతంలోకి చిరుత పులి వెళ్లిపోయింది. శ్రీశైలంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# అక్టోబర్ 20 నుండి అయ్యప్ప భక్తులకు అన్నదానం,మాలధారణ, పడిపూజలు ప్రారంభం



కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి:కుత్బుల్లాపూర్ నియోజకవర్గంనిజాంపేట్ లోని శ్రీనివాస్ నగర్ లో కొలువైన శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం నందు అక్టోబర్ 20 నుండి డిసెంబర్ 20 వరకు నిత్య అన్నదానం నిర్వహించబడను అన్ని ఆలయ కమిటీ పేర్కొంది. ప్రతి సంవత్సరం నిర్వహించే అయ్యప్ప మాలధారణ, పడిపూజలు, స్వామివారి కైంకర్యాల సేవల నిమిత్తమై ఆలయ ప్రాంగణంలో మంగళవారం దేవాలయ కమిటీ సమావేశమైంది. కొలను చంద్రశేఖర్ రెడ్డి (ఆలయ చైర్మన్), శనిగల ధన్ రాజ్ యాదవ్ (డిప్యూటీ మేయర్, వైస్ చైర్మన్), నాగార్జున ఆచార్యుల (ప్రధాన అర్చకులు)ఆధ్వర్యంలో కమిటీ సమావేశమై పలు నిర్ణయాలు తీసుకున్నారు. అక్టోబర్ 20 నుండి డిసెంబర్ 20 వరకు దేవాలయ ప్రాంగణంలో నిత్య అన్నదానం నిర్వహించబడునని స్పష్టం చేశారు. అయ్యప్ప భక్తుల మాలధారణ వారి రాక బట్టి అన్నదాన కార్యక్రమం పొడిగించబడునని ఆలయ కమిటీ స్పష్టం చేసింది.ఈ కార్యక్రమంలో రాఘవేందర్ రావు (కార్పొరేటర్), ఉంగరాల శ్రీనివాస్ రావు (ఆలయ ట్రెజరర్), ఇంద్ర కుమార్ దేవ్. (గురు స్వామి), హరిబాబు (ఆర్గనైజింగ్ సెక్రటరీ ) , సతీష్ (జాయింట్ సెక్రటరీ) తదితరులు పాల్గొన్నారు.పడిపూజ, అన్నదానం కోసం సంప్రదించండిఅయ్యప్ప స్వామి దేవాలయం ప్రాంగణంలో కార్తీక మాస మండల పూజను పురస్కరించుకొని నిర్వహించే పడిపూజ, అన్నదానం, స్వామి వారి కైంకర్యాలు, ఇతరత్రా సేవల కోసం సంప్రదించాలని ఆలయ ప్రధాన పూజరులు నాగార్జున ఆచార్యులు కోరారు.సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఆలయం ప్రతి సంవత్సరం నిర్వహించే అయ్యప్ప మాలధారణ, పడిపూజలు, ఇతరత్రా ప్రత్యేక పూజలు నిమిత్తమై అయ్యప్ప స్వామి దేవాలయం సర్వంగ సిద్ధనంగా సిద్ధమైంది. రెండు సంవత్సరాల క్రితం వేద పండితుల ఆశీర్వచనాలు, ప్రత్యేక ప్రతిష్ట, హెూమాలతో ప్రారంభమైన అయ్యప్ప స్వామి దేవాలయం దినదినాభివృద్ధి చెందుతూ వస్తుంది. అయ్యప్ప భక్తుల రాక, మాలధారణ సైతం గత రెండు సంవత్సరాల్లో గణనీయంగా పెరిగింది. అయ్యప్ప భక్తుల కోసం సకల సౌకర్యాలను దేవాలయ కమిటీ కల్పించింది. ఇక ఈ సంవత్సరం ఇప్పటికే దేవాలయానికి పెయింటింగ్ పూర్తి కావడంతో ఆలయం నూతన శోభతో కళకళలాడుతుంది.



# ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల స్క్రుటినిపకడ్బందీగా నిర్వహించాలి



రాబోయే 5 రోజుల పాటు స్క్రుటిని వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుల స్క్రుటిని పక్కడ్బందీ గా నిర్వహించాలిపెండింగ్ ధరణి దరఖాస్తుల స్క్రూటినీ పూర్తి చేయాలి.నూతన ఆర్ఓఆర్ చట్టం ముసాయిదా బిల్లు పై జిల్లాస్థాయిలో వర్క్ షాప్ నిర్వహణ.ఎల్ .ఆర్.ఎస్, భారీ వర్షాలు, ధరణి , ఆర్ఓఆర్ చట్టం పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారిరాబోయే ఐదు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని, నీటి వనరుల నిర్వహణ సమర్థవంతంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.మంగళవారం ఖమ్మం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఎల్.ఆర్.ఎస్, భారీ వర్షాలు, ధరణి, ఆర్.ఓ.ఆర్. చట్టం పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ రెవిన్యూ వెంకటేశ్వర్లు తో కలిసి ఈ విడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎల్.ఆర్.ఎస్. కు సంబంధించి దాదాపు 20 లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, వీటి స్క్రూటినీ నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం త్వరితగతిన పూర్తి చేసేలా జిల్లా కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధ చూపించి సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. సిబ్బంది కొరత ఉన్నచోట అవసరమైతే తాత్కాలిక ప్రాతిపదికన అదనపు సిబ్బందిని నియమించుకొని పనులు పూర్తిచేయాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులలో అవసరమైన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో పర్య షిప్ టించి వివరాలను సేకరించాలని, జిల్లాలో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రకారం అవసరమైన బృందాలను ఏర్పాటు చేసి వారు వివరాలు సేకరించి యాప్ లో నమోదు చేసేలా చూడాలని మంత్రి పేర్కొన్నారు. ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను సర్వే నెంబర్ల వారీగా సంబంధిత రెవెన్యూ గ్రామం/మున్సిపాలిటీ లలో బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన చేసి జిపిఎస్ ద్వారా సదరు భూమి కో ఆర్డినేట్స్ పక్కాగా నమోదు చేస్తారని, అదే సమయంలో ఈ భూములు నీటి వనరుల బఫర్ జోన్, నాలా, చెరువులు, హెరిటేజ్ బిల్డింగ్, డిఫెన్స్ ల్యాండ్ పరిధిలోవి కావని ధ్రువీకరించాలని అన్నారు. ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ 3 నెలలో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఎల్.ఆర్.ఎస్ ప్రక్రియ ద్వారా ఎక్కడ ప్రభుత్వ భూమికి నష్టం కలగవద్దని, అదే విధంగా నీటి వనరులు, కాలువలు చెరువుల ఆక్రమణలకు పాల్పడవద్దని అధికారులకు సూచించారు. ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుల స్క్రుటిని కట్టుదిట్టంగా సకాలంలో పూర్తి చేయాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించాలని మంత్రి సూచించారు.ధరణి పోర్టల్ లో పెండింగ్ ఉన్న దరఖాస్తుల స్క్రుటిని పూర్తి చేసి పరిష్కరించాలని, తిరస్కరించే దరఖాస్తులకు సదరు కారణాలు తెలియజేయాలని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నూతన ఆర్ఓఆర్ చట్టం ముసాయిదా బిల్లు ప్రతిపాదించిందని, దీని పై జిల్లాలలో ఆగస్టు 23, 24వ తేదీలలో వర్క్ షాప్ నిర్వహించి, ముసాయిదా బిల్లులో చేయాల్సిన మార్పులు, మెరుగైన సూచనలు ఏవైనా ఉంటే ఫీడ్ బ్యాక్ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి అందజేయాలని మంత్రి సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, మున్సిపల్ కమిషనర్, జానకిరామ్ సాగర్, తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ కాజా మొహినిద్దీన్, %జు.జు% పి ఆర్ నరసింహులు, జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ సంబంధిత కలెక్టరేట్ ధరణి సెక్షన్స్ సూపరిండెంట్ , కలెక్టరేట్ ఏవో యూనస్ , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# ఆరోగ్యం



## పొట్లకాయ లాభాలు..!

మనకి తరచూ ఎక్కువగా దొరికేటువంటి పండ్లు ,కాయగూరలు తినడం వల్ల మనకు తెలియకుండానే చాలా లాభాలు ఉన్నాయి. అలాంటి వాటిలో పొట్లకాయ కూడా ఒకటి. ఇందులో పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ఇందులో ఉండే పిండి పదార్థాలు, విటమిన్ A,B-1,B-2,B-3,B-6,B -9 వంటివే కాకుండ మెగ్నీషియం, ఐరన్, జింక్ వంటి ఖనిజాలు పుష్కలంగా లభిస్తాయి. ఇది మన జీర్ణ క్రియను సైతం మెరుగుపరచడానికి ఉపయోగపడుతుంది. అలాగే మనం తిన్న ఆహారాన్ని కూడా చాలా త్వరగానే జీర్ణం చేయడానికి ఉపయోగపడుతుందట. ఇవే కాకుండా మరికొన్ని ఉపయోగాలు ఉన్నవి. పొట్లకాయలు ఎక్కువ మొత్తంలో ఫైబర్ ఉండడం వల్ల ఇది తిన్న వెంటనే కడుపు ఖాళీగా లేని అనుభూతి కలుగుతుంది. అందుకే ఆకలి వేయడం కూడా తగ్గుతుంది. శరీరంలో వ్యర్థ కొవ్వును సైతం వేగవంతంగా తగ్గిస్తుంది. పొట్లకాయలో ఉండే క్యాలరీలు కొవ్వును పెంచనివ్వదు. పొట్లకాయను తినడం వల్ల కీళ్ల వ్యాధులు సైతం రాకుండా అడ్డుకుంటుంది. వృద్ధులకు చాలా మేలు చేస్తుంది. థైరాయిడ్ తో ఇబ్బంది పడేవారు వీటిని తినడం మంచిది. ఇందులో ఉండే మెగ్నీషియం, కాల్షియం, విటమిన్స్ ,పొటాషియం వంటివి శరీరానికి అవసరమైన శక్తిని సైతం అందిస్తాయి. రక్తంలో ఉండేటువంటి గ్లూకోజ్ స్థాయిని కూడా తగ్గించడానికి పొట్లకాయ ఉపయోగపడుతుంది. అంతేకాకుండా గుండె ఆరోగ్యంగా ఉంచడానికి కూడా ఉపయోగపడుతుంది. పొట్లకాయ జ్యూస్ తాగడం వల్ల పొట్టిగా ఉన్నవారు కూడా పొడవుగా అవుతారని చాలామంది నమ్ముతూ ఉంటారు. అలాగే ఎముకలు దృఢంగా మారడానికి ప్రశాంతంగా నిద్రపోవడానికి కూడా పొట్లకాయను తినడం మంచిది. క్యాన్సర్ రాకుండా నిరోధించే గుణాలు పొట్లకాయలు పుష్కలంగా ఉన్నాయట. గుండె పోటు వంటివి రాకుండా కూడా గుండెను ఆరోగ్యంగా ఉంచడానికి పొట్లకాయ చాలా ఉపయోగపడుతుంది. కిడ్నీ పనితీరు కూడా మెరుగుపరచడానికి ఈ పొట్లకాయ చాలా ఉపయోగపడుతుంది. ఇలా ఎన్ని విధాలుగా చూసిన పొట్లకాయను తినడం చాలా ఉపయోగకరమని చెప్పవచ్చు.

## లెమన్ ఆయిల్ తలకు రాస్తే

### ఈ అద్భుతమైన ప్రయోజనాలు..?

నిమ్మ నూనె లేదా లెమన్ ఆయిల్ అనేది జుట్టుకు చాలా మేలు చేస్తుంది. ఇందులో చాలా రకాల మంచి గుణాలు ఉన్నాయి. ఇది జుట్టులో ఉండే బ్యాక్టీరియా, ఫంగస్ వంటి వాటిని చంపుతుంది. అంతేకాకుండా, స్కాల్ప్ ఇన్ఫ్లమేషన్ తగ్గిస్తుంది. ఈ నూనెలో విటమిన్లు కూడా ఉంటాయి. వీటితో జుట్టుకు మాస్కులు తయారు చేసుకోవచ్చు. నిమ్మ నూనెను వారానికి రెండుసార్లు జుట్టుకు అప్లై చేసుకుంటే హెయిర్ గ్రోత్ అనేది ఫాస్ట్ గా జరుగుతుంది. ఇంట్లోనే సులభంగా దీన్ని ఉపయోగించుకోవచ్చు. వివిధ రకాల హెయిర్ మాస్కులలో కూడా దీన్ని కలుపుకోవచ్చు. లెమన్ ఆయిల్ ఎక్కువగా వాడితే జుట్టు బలంగా, ఆరోగ్యంగా ఉంటుంది. యాంటీ ఫంగల్, యాంటీ బాక్టీరియల్, యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉన్న ఈ ఆయిల్ హెయిర్ కండీషనర్గా కూడా పనిచేస్తుంది. చర్మం, జుట్టుకు



సంబంధించిన చాలా సమస్యలను తగ్గిస్తుంది. నిమ్మ తొక్కల నుంచి తీసిన తైలం కాబట్టి, ఇది చాలా సహజమైనది. డైలీ హెయిర్ కు దీనిని అప్లై చేసుకుంటూ ఉంటే ఇన్ఫెక్షన్లు రాకుండా జాగ్రత్త పడొచ్చు. తల చుండ్రు సమస్య కూడా తగ్గుతుంది. రోజ్మేరీ ఆయిల్ లేదా కొబ్బరి నూనెతో కలిపి వాడితే మరింత మంచి ఫలితాలు లభిస్తాయి.

నిమ్మ నూనె ముఖం మీద ఉండే మొటిమలను తగ్గిస్తుంది. చర్మం మీద బ్యాక్టీరియా పెరగకుండా నిరోధిస్తుంది. టీ ట్రీ ఆయిల్తో కలిపి వాడితే మరింత ప్రభావవంతంగా ఉంటుంది. జుట్టు చిక్కులు పడకుండా ఉండాలంటే కూడా లెమన్ ఆయిల్ వాడవచ్చు. ఇది జుట్టులోని బ్యాక్టీరియాను చంపి, జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. దీంతోపాటు క్యాస్టర్ ఆయిల్ కూడా వాడవచ్చు. ఆముదం నూనె జుట్టుకు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. దీంతో జుట్టు బలంగా పెరుగుతుంది. కొబ్బరి నూనెలో విటమిన్ సి, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఆముదం నూనె, ఆలివ్ ఆయిల్, లెమన్ ఆయిల్ మూడు కలిపి జుట్టుకు రాసుకుంటే మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చు. వారానికి ఒకసారి ఈ మాస్క్ను వాడితే మంచి ఫలితాలు లభిస్తాయి. అయితే దీనిని ట్రై చేసే ముందు డెర్మటాలజిస్టుల సలహా తీసుకోవడం మంచిది.

## బ్రేక్‌ఫాస్ట్ తినడం మానేస్తున్నారా?

మారిన జీవనశైలి కారణంగా చాలామంది లేటుగా నిద్రలేస్తున్నారు. దీంతో ఉదయాన్నే టిఫన్ చేసే అలవాటు కూడా మర్చిపోతున్నారు. కొందరైతే పొద్దున్న ఆఫీస్కి లేదా స్కూల్, కాలేజీకి ఆలస్యం అవుతుంది ఏమో అని భయంతో బ్రేక్ఫాస్ట్ మానేస్తున్నారు.ఒక్కపూట తినకపోతే ఏమవుతుందలే అని తినడం మానేస్తున్నారు. చాలామంది బరువు తగ్గాలని తిండిని తగ్గిస్తున్నారు. ఈరోజుల్లో ఎక్కువమంది నైట్షిఫ్ట్లు చేస్తున్నారు. పొద్దున్నే నిద్రపోతున్నారు. కానీ బ్రేక్ఫాస్ట్ను స్కిప్ చేస్తున్నారు. దీనివల్ల ఎన్నో నష్టాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. మరి అవేంటో తెలుసుకుందాం. ఉదయం పూట అల్పహారం తినకపోతే శరీరం అలసటకు గురవుతుంది. దీంతో రోజంతా నీరసంగా ఉంటారు. సరిగ్గా పనిచేయలేరు. బాడీ యాక్టివ్ లేకపోతే పనిపై అంత ఆసక్తి కూడా ఉండదు. కొన్ని రోజులకు రక్తహీనత ఎక్కువ అవుతుంది. అలాగే చిరాకు పెరుగుతుంది. దీంతో మానసిక సమస్యలు వస్తాయి. బ్రేక్ఫాస్ట్ స్కిప్ చేయడం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు సరిగ్గా అందవు. దీంతో అనారోగ్య సమస్యలు వస్తాయి. రాత్రి నుంచి పొద్దున్న వరకు నిద్రపోవడం వల్ల ఎక్కువ సమయం కడుపు ఖాళీగా ఉంటుంది. పొద్దున్న కూడా బ్రేక్ఫాస్ట్ స్కిప్ చేస్తే జీవక్రియ మీద ప్రభావం చూపుతుంది. దీంతో జీర్ణ సమస్యలు వస్తాయి. కాబట్టి ఎంత బిజీగా ఉన్నాసరే బ్రేక్ఫాస్ట్ అయితే మానవద్దు. శరీరానికి కావల్సిన పోషకాలు అన్ని బ్రేక్ఫాస్ట్లో ఉంటాయి. కాబట్టి తప్పకుండా ఉదయం తినాలి. రైస్ తినలేని వాళ్లు ఏదో ఒకటి తప్పకుండా తినాలి. సాధారణంగా చాలామంది బ్రేక్ఫాస్ట్ తక్కువగా తిని.. రాత్రిపూట ఎక్కువగా తింటారు. కానీ రాత్రిపూట తక్కువగా తిని బ్రేక్ఫాస్ట్ ఎక్కువగా తినాలి. అప్పుడే శరీరానికి కావాల్సిన కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు అందుతాయి. శారీరకంగా, మానసికంగా స్ట్రాంగ్గా ఉండాలంటే ఉదయం బ్రేక్ఫాస్ట్ అనేది తప్పనిసరి. పిల్లలకు అయితే బ్రేక్ఫాస్ట్ అసలు స్కిప్ చేయకూడదు. వాళ్లు తొందరగా పెరగాలన్నా..

వాళ్ల మెదడు చురుకుగా పనిచేయాలన్నా ఉదయం పూట తప్పకుండా తినాలి. సాధారణంగా నాలుగు గంటల్లో మనం తీసుకున్న ఆహారం జీర్ణం అవుతుంది.

## ఏసీ కింద నిద్రపోతున్నారా..

### వ్యాధులను కొని తెచ్చుకున్నట్టే..?



ప్రస్తుతం మారుతున్న జీవనశైలి లోనే మార్పుల వల్ల చాలా మంది తినే ఆహారంతో పాటు నిద్రిస్తున్న సమయంలో కూడా చాలా మార్పులు చేస్తూ ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎక్కువ మంది సకాలంలో ఏసీ లేకుండా నిద్రపోవడం చాలా కష్టంగా మారుతున్నది

.ఈ అలవాటు చాలా మందికి ఉండనే ఉంటుంది. ప్రతిరోజు కష్టపడి తర్వాత శరీరం కాస్త విశ్రాంతి తీసుకోవడం కోసం చల్లదనం కోసం ఏసీ కింద హాయిగా నిద్రపోతూ ఉంటారు. ఏసి కింద ఎక్కువసేపు పడుకోవడం వల్ల ఎలాంటి ప్రమాదమో ఇప్పుడు చూద్దాం.ప్రస్తుతం వర్షాకాలం నడుస్తూ ఉండడం వల్ల.. వర్షాలు పడుతూ ఉండడం వల్ల ఒక్కసారిగా వాతావరణం లో మార్పులు కనిపిస్తూ ఉంటాయి. ఇలాంటి సమయంలో వివిధ రకాల వైరస్లు, బ్యాక్టీరియాలు తీవ్రమైన ప్రభావాన్ని చూపించి జలుబు, జ్వరం, దగ్గు వంటివి వ్యాప్తి చెందేలా చేస్తాయి. అంతేకాకుండా దోమలు కూడా వివిధ రకాల వాతావరణ ప్రాంతం నుంచి వస్తూ ఉంటాయి. వర్షాలు ఎక్కువగా పడడం చేత నీటి ద్వారా కూడా పలు రకాల వ్యాధులు వ్యాప్తి చెందుతూ ఉంటాయి. ఇలాంటి సమయంలో ఏసీ లేకుండా నిద్రపోనీ వారికి కల్లు పోరి బారడం.. వాతావరణం లో వచ్చేటువంటి తేమ కారణంగా చికాకుగా మంటగా కూడా అనిపిస్తుందట. అలాగే చర్మానికి సంబంధించిన సమస్యలు ఏర్పడతాయట. ఏసి కింద ఉన్నవారు నిరు చాలామంది తక్కువగా తాగుతూ ఉంటారు. కానీ ఇది చాలా తప్పట.. నీరు ఎక్కువగా తాగడం చాలా మంచిదట. దీనివల్ల శరీరం డిహైడ్రేడ్ కాకుండా ఉంటుంది. అలాగే అలర్జీలకు చర్మం పొరలు పొడిబారకుండా ఉండేందుకు బాగా సహాయపడుతుంది. మైగ్రేన్ సమస్యతో ఇబ్బంది పడేవారు ఏసి కింద అసలు పడుకోవడం మంచిది కాదు. దీనివల్ల తలనొప్పి ఎక్కువగా వస్తూ ఉంటుందట. ఏసీలో చిక్కుకున్న దుమ్ము దూళి వల్ల ఊపిరితిత్తులకు చాలా సమస్యలు ఏర్పడతాయి అలాగే అలర్జీ ఆస్తమా వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందట.

## ఆహారం తిన్న వెంటనే

### నీళ్లు ఎందుకు తాగకూడదు..?



భోజనం చేసిన వెంటనే నీరు తాగకూడదని ఎప్పుడూ మనం వింటూ ఉంటాం కదా? కానీ, ఎందుకు అలా అంటారో తెలుసా? భోజనం తర్వాత వెంటనే నీరు తాగడం చాలా మందికి అలవాటు. కానీ, ఇది మన ఆరోగ్యాన్ని ఎలా దెబ్బతీస్తుందో తెలుసా? ఆయుర్వేదం ప్రకారం, భోజనం తర్వాత వెంటనే నీరు తాగడం వల్ల జీర్ణవ్యవస్థ దెబ్బతింటుంది. దీంతో మనకు చాలా ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. భోజనం తర్వాత వెంటనే నీరు తాగడం వల్ల మన శరీరానికి ఏం జరుగుతుందో ఇప్పుడు వివరంగా చెప్పుకుందాం.

మనం ఆహారం తింటే, దాన్ని జీర్ణం చేయడానికి మన శరీరం ఒక పెద్ద పని చేస్తుంది. ఆహారాన్ని చిన్న చిన్న ముక్కలుగా చేసి, శరీరానికి కావాల్సిన పోషకాలు తీసుకోవడానికి, మన శరీరం కొన్ని రసాయనాలను (ఎంజైమ్స్ అని పిలుస్తారు) ఉత్పత్తి చేస్తుంది. ఇప్పుడు, భోజనం చేసిన వెంటనే నీరు తాగితే ఏమవుతుందంటే, ఈ ఎంజైమ్స్ నీటితో కలిసిపోయి వాటి బలం తగ్గిపోతుంది. దీంతో ఆహారం సరిగ్గా జీర్ణం కాదు. ఫలితంగా, అజీర్తి, గ్యాస్ లాంటి సమస్యలు వేధిస్తాయి. మనం భోజనం చేసిన వెంటనే నీరు తాగితే, మనకు త్వరగా ఆకలి వేస్తుంది. ఎందుకంటే, నీరు మన కడుపుని నింపుతుంది. కొంత సేపటికి ఆ నీరు జీర్ణమైపోయి, ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోవడంతో మళ్ళీ ఆకలి వేస్తుంది. దీంతో మనం ఎక్కువ ఆహారం తింటాం. ఇలా ఎక్కువగా తింటూ ఉంటే బరువు పెరుగుతాం. మనం తినే ఆహారంలో చాలా రకాల పోషకాలు ఉంటాయి. ఈ పోషకాలు మన శరీరానికి చాలా ముఖ్యం. కానీ, భోజనం తర్వాత వెంటనే నీరు తాగితే, ఆ నీరు ఆహారంలోని పోషకాలను కలిసిపోయి, మన శరీరానికి ఆ పోషకాలు సరిగ్గా అందవు. దీంతో శరీరానికి కావాల్సిన పోషకాలు దొరకక, చాలా రకాల అనారోగ్యాలు వచ్చే అవకాశం ఉంది. భోజనం చేసిన తర్వాత కనీసం అరగంట తర్వాత నీరు తాగితే మంచిది. ఈ సమయంలో ఆహారం జీర్ణం అయ్యే ప్రక్రియ మొదలవుతుంది. అప్పుడు నీరు తాగితే, శరీరానికి నీరు అందుతుంది.

## పిల్లలు బరువు పెరగట్లేదా?

పిల్లలను తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచే చాలా జాగ్రత్తగా చూసుకుంటారు. వాళ్లకు ఎలాంటి కష్టం రాకుండా ఉండాలని అడిగినవి అన్ని కొని ఇస్తుంటారు. అయితే కొందరు పిల్లలు పుట్టినప్పటే తక్కువగా బరువుతో పుడతారు. అలానే ఉంటారు కానీ మళ్లీ బరువు పెరగరు. చిన్నపిల్లలు బరువు తక్కువగా ఉండటం వల్ల వాళ్లకు అనారోగ్య సమస్యలు వస్తాయి. వాళ్ల వయస్సుకు తగ్గట్లుగా బరువు పెరుగుతుండాలి. అప్పుడే ఆరోగ్యంగా ఉంటారు. లేకపోతే ఆసుపత్రి పాలు కావడం తప్పదు. సాధారణంగా పిల్లలు చాలా తక్కువ ఆహారం తీసుకుంటారు. తినట్లేదు కదా అని అలా వదిలేయకూడదు. ఏదో రకంగా వాళ్లకు నచ్చ చెప్పి తినిపించాలి. అయితే పిల్లలకు ప్రొటీన్



ఉండే ఆహారం పెట్టాలి. అప్పుడే వాళ్లు వయస్సుకు తగ్గట్లు బరువు పెరుగుతారు. తొందరగా బరువు పెరగాలంటే పిల్లలకు ఎలాంటి ఆహారం పెట్టాలో తెలుసుకుందాం. ఏడాది లోపు పిల్లలు అయితే వాళ్లకు మెత్తగా ఉడికించి పెట్టాలి. ఇంకా సిరలిక్ పెడుతున్నట్లయితే బార్లీ, మినుములు, కందిపప్పు, డ్రైఫ్రూట్స్తో పౌడర్ చేసుకోవాలి. దీనిని ఇక్కిరిలా చేసి తినిపించాలి. అప్పుడే పిల్లలు ఆరోగ్యంగా బరువు పెరగుతారు. రైస్ తినే పిల్లలు అయితే అన్నం వండుకొనేటప్పుడు అందులో కొంచెం కందిపప్పు, బార్లీ, క్యారెట్, బీట్రూట్ వంటివి ఉడికించుకోవాలి. లేదా అన్నంలో కొన్నిసార్లు రాగిజావ కలిపి పెట్టాలి. ఇలా చేయడం వల్ల పిల్లలు తొందరగా బరువు పెరగడానికి అవకాశం ఉంటుంది. అయితే పిల్లలకు ఎక్కువగా ఒక్కసారి కాకుండా కొంచెం కొంచెం పెడుతుండాలి. రెండేళ్లకు దగ్గర అవుతున్న పిల్లలకు ఉడికించిన గుడ్లు తినిపించాలి. ఇందులో ప్రొటీన్ ఉండటం వల్ల పిల్లలు తొందరగా బరువు పెరుగుతారు.

కాబట్టి రోజూ ఉదయం కనీసం ఒక గుడ్డు అయిన మీ పిల్లలకు పెట్టండి. అలాగే బిస్కెట్లు, రస్కులు, చాక్లెట్లు, చిప్స్ వంటివి పిల్లలకు ఇవ్వద్దు. వీటివల్ల బరువు పెరుగుతారు. కానీ అది ఆరోగ్యం కాదు. పిల్లలు ఆరోగ్యంగా బరువు పెరిగేలా చూడండి. చాలామంది పిల్లలు పాలు తాగడానికి అంతగా ఇష్టపెట్టుకోరు. కానీ ఏదో రకంగా పిల్లలకి పాలు అలవాటు చేయండి. డైలీ ఉదయం, రాత్రి పాలు తాగడం వల్ల ఎముకలు బలంగా తయారవుతాయి.

## బొరుగులు తింటే ఎన్ని లాభాలో తెలుసా..?

మన పూర్వము నుంచి చాలామందికి బొరుగులు అంటే తెలిసే ఉంటుంది. అయితే ఇప్పుడున్న వారికైతే మరమరాలు అంటే ఇట్టే గుర్తు పడతారు. ఇవి ఎక్కడైనా లభిస్తూ ఉంటాయి. అయితే వీటితో తయారు చేసే వంటకాలు అన్నీ కూడా తినడానికి టేస్ట్ గానే ఉంటాయి. ముఖ్యంగా స్ట్రీట్ ఫుడ్ లలో ఇది కూడా ఒకటని చెప్పవచ్చు. ముఖ్యంగా కారం బొరుగులు ,మసాలా చార్ట్ వంటి వాటిని ఎక్కువగా వీటిని ఉపయోగిస్తూ ఉంటాము. అయితే వీటి వల్ల తినడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదనీ చాలామంది అనుకుంటూ ఉంటారు కానీ వీటిని తినడం వల్ల కూడా చాలా ప్రయోజనాలు ఉన్నాయట వాటి గురించి చూద్దాం. బొరుగులలో చాలా న్యూట్రియన్స్ లభిస్తాయి ఇందులో ఉండే ఫైబర్ జింక్ ఐరన్ విటమిన్- A,C వంటివి పుష్కలంగా లభిస్తాయి. ఎవరైనా మలబద్ధక సమస్యతో ఇబ్బంది పడుతున్న వారు వీటిని తినడం



వల్ల ఆ సమస్యను దూరం చేసుకోవచ్చు. అంతేకాకుండా శరీరంలో పేరుకుపోయిన కొవ్వును కూడా కరిగించడానికి చాలా ఉపయోగపడుతుంది. బొరుగులు తినడానికి చాలా తేలికగా ఉండటం వల్ల ఇందులో క్యాలరీలు కూడా చాలా తక్కువగానే ఉంటాయి. ఇందులో ఉండే ఫైబర్ మనకి ఆకలి వేయకుండా చేస్తుందట. మన శరీరంలో బోన్లెస్ గ్రోత్ పెరగడానికి శరీరం డెవలప్మెంట్ కావడానికి చాలా ఉపయోగపడుతుంది. షుగర్ లెవెల్స్ కూడా కంట్రోల్ చేయడానికి చాలా ఉపయోగపడుతుంది. జీర్ణ సమస్యలతో ఇబ్బంది పడేవారు వీటిని కనీసం వారంలో రెండు మూడు సార్లు అయినా తినడం వల్ల చాలా మంచిది. ఇందులో ఉంటే యాంటీ ఆక్సిడెంట్ల వల్ల చర్మం కూడా చాలా సహజంగా మెరిసేలా చేస్తోందట. అయితే వీటిని అతిగా తిన్నా కూడా గ్యాస్ సమస్యలు ఎదురవుతాయి

.అందుకే కొంత మేరకు మాత్రమే వీటిని తినడం మంచిది. అయితే రోడ్డు మీద దొరికేటువంటి మసాలాతో కలుపుకొని తినడం వల్ల ఇబ్బందులు ఏర్పడతాయి.

# మేనిఫెస్టో విడుదల చేసిన నేషనల్ కాన్ఫరెన్స్

**శ్రీనగర్ :** జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. ఈ అసెంబ్లీ ఎన్నికలు మూడు విడతలుగా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా సోమవారం శ్రీనగర్‌లో తమ పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఆర్టికల్ 370తోపాటు 35ఏని పునరుద్ధరిస్తామని ఆయన స్పష్టం చేశారు. వీటితోపాటు మరో 10 అంశాలను మేనిఫెస్టో జాబితాలో పొందు పరిచారు. ప్రజా భద్రత చట్టాన్ని రద్దు చేస్తామన్నారు. అలాగే రాజకీయ ఖైదీలను విడుదల చేస్తామని తెలిపారు. భారత్, పాక్ మధ్య నిలిచిపోయిన చర్చలను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుక బడిన మహిళలకు ఏడాదికి 12 గ్యాస్ సిలెండర్లు అందజేస్తామన్నారు. అలాగే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాశ్మీర్ పండిట్లకు పూర్వ వైభవం తీసుకు వస్తామని తెలిపారు. పాస్‌పోర్టు సౌకర్యాన్ని సులభతరం చేస్తామన్నారు. ఇక జాతీయ రహదారులపై ప్రజలను, వాహనదారులను ఇష్టారీతిలో ఆపడం, తనిఖీలు నిర్వహించడం వంటి ఘటనలు నిరోధిస్తామని చెప్పారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంతోపాటు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. 90 స్థానాలున్న జమ్మూ కశ్మీర్ అసెంబ్లీకి



మూడు విడతలుగా... సెప్టెంబర్ 18, సెప్టెంబర్ 25, అక్టోబర్ 1వ తేదీన ఎన్నికల పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు ఇవి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో ఓటరు ఏ పార్టీకి పట్టం కట్టనున్నాడనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# సీఎం సిద్ధరామయ్యకు తాత్కాలిక ఉపశమనం

**బెంగళూరు :** కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు హైకోర్టులో తాత్కాలిక ఉపశమనం లభించింది. ఆగస్ట్ 29వ తేదీ వరకు ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకో వద్దని ట్రయిల్ కోర్టును కర్ణాటక హైకోర్టు ఆదేశించింది. ముడా కుంభకోణంలో సీఎం సిద్ధరామయ్యను ప్రాసిక్యూషన్ చేసేందుకు ఆ రాష్ట్ర గవర్నర్ తవర్‌చంద్ గెహ్లాత్ అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. గవర్నర్ ఆదేశాలను నిలిపివేయాలంటూ సీఎం సిద్ధరామయ్య సోమవారం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు.

ఈ రిట్ పిటిషన్‌పై సింగిల్ బెంచ్ జడ్జి హేమంత్ చందన్‌గౌడ్ ఆధ్వర్యంలో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సీఎం సిద్ధరామయ్య తరపు న్యాయవాదీ అభిషేక్ మను సింఘ్వీ తన వాదనలను వినిపించారు. ఆ క్రమంలో ఆగస్ట్ 29వ తేదీ వరకు సీఎం సిద్ధరామయ్యను ఎలాంటి విచారణ జరప వద్దని న్యాయమూర్తికి వివరించారు. దీంతో న్యాయవాది సింఘ్వీ



వాదనలతో సింగిల్ జడ్జి జస్టిస్ హేమంత్ చందన గౌడ్ ఏకీభవించారు. దీంతో ఆగస్ట్ 29వ తేదీ వరకు ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకో వద్దని ఆదేశించింది.

మైసూర్ నగరాభివృద్ధి సంస్థ (ముడా) కుంభకోణంలో సీఎం సిద్ధరామయ్య ప్రమేయం ఉందంటూ.. సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ, టీజే అబ్రహం తదితరులు.. ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సీఎం సిద్ధరామయ్యను ప్రాసిక్యూషన్ చేసేందుకు ప్రత్యేక కోర్టుకు గవర్నర్ తావర్ చంద్ గెహ్లాత్ ఆగస్ట్ 17వ తేదీన అనుమతి ఇస్తూ.. ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను వెంటనే రద్దు చేయాలంటూ సిఎం సిద్దరాయమ్య.. సోమవారం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రిట్ పిటిషన్‌ను సోమవారం సింగిల్ జడ్జి జస్టిస్ హేమంత్ చందన్ గౌడ్ విచారించారు. సీఎం సిద్ధరామయ్యను ఆగస్ట్ 29వ తేదీ వరకు ప్రాసిక్యూషన్ చేయకూడదంటూ సింగిల్ జడ్జి జస్టిస్ హేమంత్ చందన్ గౌడ్ ఆదేశించారు. దీంతో సీఎం సిద్ధరామయ్యనకు తాత్కాలిక ఉపశమనం లభించినట్లు అయింది.

## ఆమె నిర్మమతా బెనర్జీ

### దీదీ రాజీనామాకు బీజేపీ డిమాండ్

కోల్‌కతాలోని ఆర్జీ కార్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనకు బాధ్యత వహించి పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. సీఎం మమతా బెనర్జీని విధ్వంసకురాలిగా బీజేపీ ప్రతినిధి గౌరవ్ భాటియా అభివర్ణించారు. ఈ హేయమైన ఘటన అనంతరం ఆమె పేరును రాష్ట్ర ప్రజలు నిర్మమతా బెనర్జీగా మార్చేశారని ఎద్దేవా చేశారు. మమతా బెనర్జీ తన చేష్టలతో సమాజానికి సేవ చేసే ఓ యువ డాక్టర్ గౌరవాన్ని మంటగలిపారని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టబద్ధ పాలనకు దీదీ పాతరేశారని తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ నేరంలో ఆధారాలను స్వయంగా సీఎం చెరిపివేయడం హేయమని అన్నారు. దేశ రాజ్యాంగాన్నే ఆమె నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. విద్యార్థులను కాపాడాల్సిన మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ తన విధులను నిర్వర్తించడంలో విఫలమయ్యారు

## చర్చలు జరగలేదు: బాబులాల్ మారండి

జేఏంఎంలో సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి చంపై సోరెన్ కాక రేపారు. తనకు అవమానం జరిగిందని, సీఎల్పీ సమావేశం గురించి తెలియదని, సీఎం పదవికి రాజీనామా చేయాలని కోరడంతో షాక్ తిన్నానని సోరెన వివరించారు. జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల కన్నా ముందే పార్టీ మారతానని హింట్ ఇచ్చారు. ఏ పార్టీ, ఎప్పుడు చెరతారనే అంశంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. బీజేపీలో చేరతారనే ఊహాగానాలు మాత్రం జోరందుకున్నాయి.

బీజేపీలో చేరతారా..?

చంపై సోరెన్ జార?ండ్ నుంచి ఢిల్లీ రావడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. నేడో, రేపే పార్టీ మారతారాని జోరుగా ప్రచారం జరిగింది. వ్యక్తిగత కారణాలతో ఢిల్లీ వచ్చానని సోరెన్ వివరించారు. ఇదే అంశంపై జార?ండ్ బీజేపీ చీఫ్ బాబులాల్ మారండిని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. చంపై సోరెన్ బీజేపీలో చేరతారా..? ఎప్పుడు చేరతారని అడిగారు.

ఆయనే ప్రకటిస్తారు..

'చంపై సోరెన్ బీజేపీలో చేరే అంశానికి సంబంధించి ఇప్పటి



వరకు చర్చ జరగలేదు. చంపై సోరెన్ అనుభవం ఉన్న నేత, నిర్ణయాన్ని ఆయన ప్రకటిస్తారు. ప్రత్యేక జార?ండ్ రాష్ట్రం కోసం పోరాడిన వారిలో చంపై సోరెన్ ఒకరు. సోషల్ మీడియాలో చంపై సోరెన్ చేసిన పోస్ట్ చూసి బాధ కలిగింది. పార్టీలో జరిగిన అవమానంతో తీవ్రంగా బాధ పడ్డారు. సీఎం పదవి నుంచి తొలగించిన విధానం బాధ కలిగించింది. అందుకే పార్టీతో అంటిముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు అని' బాబులాల్ మారండి అభిప్రాయ పడ్డారు.

## కోల్‌కతా డాక్టర్ కేసుపై ఆప్ ఎంపీ హర్భజన్ సింగ్ లేఖ..

# స్పందించిన బెంగాల్ గవర్నర్

కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ ఆస్పత్రిలో ఆగస్టు 9న మహిళా వైద్యురాలిపై హత్యాచారం ఘటన ప్రస్తుతం దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారిపోయింది. ఈ విషాద ఘటన విషయంలో మాజీ క్రికెటర్, ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యుడు హర్భజన్ సింగ్ రాసిన గవర్నర్‌కు బహిరంగ లేఖ రాశారు. ఈ కేసు విషయంలో ఏం చర్యలు తీసుకున్నారని సోషల్ మీడియా ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. దీనిపై స్పందించిన పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద్ బోస్ రాష్ట్రంలోని వివిధ సంఘాల ప్రతినిధులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ విషయంలో తీసుకున్న చర్యల గురించి తెలియజేయడానికి, ఈ విషయంలో వారి అభిప్రాయాన్ని తెలుసుకోవడానికి గవర్నర్ అత్యవసరంగా సమావేశమయ్యారు.

ఆసుపత్రులలో భద్రతా ప్రోటోకాల్‌లను బలోపేతం చేయడం, హింసాత్మక బాధితులకు తగిన సహాయాన్ని అందించడం వంటి చర్యలు తీసుకోవాలని హర్భజన్ సింగ్ లేఖలో కోరారు. ఆరోగ్య సంరక్షణ నిపుణులందరికీ సురక్షితమైన పని వాతావరణాన్ని సృష్టించాలన్నారు. సురక్షితమైన పని వాతావరణాన్ని కోరుతూ సమ్మె చేస్తున్న వైద్యులకు రాజకీయవేత్తగా మారిన హర్భజన్ సింగ్ మద్దతు తెలిపారు. వైద్య సంఘం ఇప్పటికే సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో పని చేస్తుందని ఆయన చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో వారి భద్రత కూడా చాలా ముఖ్యమన్నారు. భయాందోళనల నేపథ్యంలో వారు పనిచేస్తున్నప్పుడు అంకితభావంతో తమ విధులను ఎలా నిర్వర్తిస్తారని ప్రశ్నించారు.

**రాజీపడే ప్రసక్తే**





ఈ నేపథ్యంలో హర్భజన్ సింగ్‌కు తీసుకున్న, తీసుకోవలసిన చర్యల గురించి గవర్నర్ వివరించనున్నారు. ఈ నేపథ్యంలో మహిళల భద్రత, గౌరవం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని గవర్నర్ అన్నారు. నేరస్తులకు చట్టపరంగా పూర్తి శిక్ష విధించి కఠినంగా శిక్షిస్తామని అన్నారు. ఇలాంటి విషాదాలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి స్త్రీ సురక్షితంగా, రక్షణగా భావించే సమాజాన్ని మేము సృష్టిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అయితే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, సీవీ ఆనంద్ బోస్ మధ్య విబేధాలు ఉన్న నేపథ్యంలోనే ఈ కేసు విచారణ ఆలస్యమవుతుందని పలువురు విమర్శలు చేస్తున్నారు.

**ఆగస్టు 9న దారుణం**

ఆగస్టు 9న కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ ఆస్పత్రి సెమినార్ హాల్‌లో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేశారు. మూడో అంతస్తులో ఉన్న సెమినార్ హాల్‌లో ఈ ఘటన అర్ధరాత్రి జరిగింది. ఆ సమయంలో ఆమె శరీరంపై చాలా చోట్ల గాయాలు కనిపించాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటన విషయంలో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌ను అరెస్టు చేశారు. దీంతోపాటు ఇతరుల ప్రమేయం కూడా ఉందని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. ఇప్పుడు ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరుపుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఈ కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు తరలించాలని ఆదేశించారు. అవసరమైతే నిందితులకు మరణశిక్ష విధిస్తామని చెప్పారు.

## మరోసారి విదేశీ పర్యటనకు ప్రధాని మోదీ



ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విదేశీ పర్యటనకు వెళుతున్నారు. ఆయన రేపు, ఎల్లుండి యూరోపియన్ దేశం పోలెండ్ లో పర్యటించనున్నారు. ఓ భారత ప్రధాని పోలెండ్ పర్యటనకు వెళుతుండడం 45 ఏళ్ల తర్వాత ఇదే ప్రథమం. మధ్య యూరప్ దేశాల్లో పోలెండ్ దేశం భారత్ కు ప్రధాన వాణిజ్య భాగస్వామిగా ఉంది. పోలెండ్ కు కు చెందిన దాదాపు 30 కంపెనీలు భారత్ లో వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. అటు, పోలెండ్ లో భారత్ కు చెందిన 5 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక, పోలెండ్ పర్యటన ముగిసిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ఉక్రెయిన్ వెళ్లనున్నారు. ఈ నెల 23న ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్ స్కీతో మోదీ భేటీ కానున్నారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య ఏడాదిన్నర కాలంగా దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో, ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మరింత ముదురుతున్న నేపథ్యంలో, మోదీ పర్యటనపై అందరి దృష్టి కేంద్రీకృతం కానుంది. చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలని భారత్ ఎప్పటినుంచో చెబుతోంది. ఇప్పుడు మోదీ కూడా జెలెన్ స్కీతో సమావేశంలో అదే వైఖరికి కట్టుబడి ఉండే అవకాశాలున్నాయి. ఓ భారత ప్రధాని ఉక్రెయిన్ లో పర్యటించనుండడం 30 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి.

## కోల్‌కతా వైద్యురాలి హత్యాచారం కేసు..

## నిందితుడికి నిజనిర్ధారణ పరీక్ష

కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ-ఆసుపత్రిలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారం కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడు సంజయ్ రాయ్‌కి నిజనిర్ధారణ పరీక్ష (ట్రై డిటెక్టర్ టెస్ట్) నిర్వహిచేంచేందుకు దర్యాప్తు సంస్థ సీబీఐకి కలకత్తా హైకోర్ట్ అనుమతి ఇచ్చింది. వైద్యురాలిపై హత్యాచారం జరిగినప్పటికీ ఆత్మహత్య చేసుకొని చనిపోయిందంటూ ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో ఈ నేరంలో ఇతరుల ప్రమేయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో నిందితుడికి నిజనిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని సీబీఐ అధికారులు కలకత్తా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులు నిందితుడికి రేపు (మంగళవారం) పాలిగ్రాఫ్ టెస్ట్ నిర్వహించే అవకాశం ఉంది. మరోవైపు ఈ కేసుపై విచారణ ఆగస్టు 29కి వాయిదా వేస్తున్నట్టు కోర్టు ప్రకటించింది. కాగా హాస్పిటల్‌లో నేరం జరిగిన ప్రదేశంలో నిందితుడు సంజయ్ రాయ్ కదలాడడం సీసీటీవీ ఫుటేజీలో కనిపించింది. అయితే మృతురాలి శరీరంలో 150 గ్రాముల శు క్రకణాలు ఉన్నట్టు గుర్తించడం, ఆమె తల్లిదండ్రులకు తప్పుడు సమాచారం అందించడంతో సామూహిక అత్యాచారం ఏమైనా జరిగిందా?, ఇంకెవరి పాత్రైనా ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## ట్రిపుల్ తలాక్‌తో ముస్లిం


## మహిళల పరిస్థితిని దయనీయం



ట్రిపుల్ తలాక్‌ను నేరంగా పరిగణించే చట్టాన్ని సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం సమర్థించింది. ట్రిపుల్ తలాక్ ఆచారం ముస్లిం మహిళల పరిస్థితిని దయనీయంగా మార్చిందని పేర్కొంది. ఈ మేరకు సోమవారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ట్రిపుల్ తలాక్ ఆచారం వివాహమనే సామాజిక సంప్రదాయానికి ప్రమాదకరంగా మారిందని పేర్కొంది. సుప్రీంకోర్టు 2017లో ఈ ఆచారాన్ని రాజ్యాంగ విరుద్ధమని పేర్కొందని తన అఫిడవిట్‌లో గుర్తు చేసింది. అయినప్పటికీ కొంతమంది ముస్లింలలో ఇప్పటికీ ఈ ఆచారం కొనసాగుతోందని సుప్రీంకోర్టుకు తెలిపింది. ట్రిపుల్ తలాక్ బాధితులు పోలీసులను ఆశ్రయించడం తప్ప మరో మార్గం లేకపోవడం... చట్టంలో శిక్షార్హమైన నిబంధనలు లేకపోవడంతో బాధిత మహిళల భర్తలపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోయిందని వెల్లడించింది. దీంతో పోలీసులు నిస్సహాయంగా మారిపోయారని పేర్కొంది. ట్రిపుల్ తలాక్ విడాకులను నిరోధించేందుకు కఠినమైన నిబంధనలు అవసరమని పేర్కొంది. ట్రిపుల్ తలాక్ విధానం చెల్లుబాటు కాదంటూ సుప్రీంకోర్టు ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని, కాబట్టి ట్రిపుల్ తలాక్ విడాకులను నేరంగా పరిగణించాల్సిన అవసరం లేదని పేర్కొంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. దీంతో కేంద్రం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది.

## ఉదంపూర్‌లో రెచ్చిపోయిన ముష్కరులు..

## కాల్పుల్లో సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వీరమరణం



జమ్మూ కశ్మీర్‌లోని ఉదంపూర్‌లో సోమవారం సీఆర్పీఎఫ్ బృందంపై ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఓ ఇన్‌స్పెక్టర్ వీరమరణం పొందినట్లు సమాచారం. ప్రస్తుతం సంఘటనా స్థలంలో భద్రతా బలగాలను మోహరించారు. ప్రస్తుతం ఉగ్రవాదులు, భద్రతా బలగాలకు మధ్య కాల్పులు జరుగుతున్నాయి. ఉదంపూర్‌లోని రామ్‌నగర్లోని చీల్ ప్రాంతంలో సీఆర్పీఎఫ్ బృందం సాధారణ పెట్రోలింగ్‌ను నిర్వహిస్తున్నది. ఈ క్రమంలో ఉగ్రవాదులు ఒక్కసారిగా విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కుల్దీప్ వీరమరణం పొందారని ఓ అధికారి తెలిపారు. అయితే, ఉగ్రవాదులకు స్థానికులు సహకారం అందిస్తున్నట్లుగా అధికారులు అనుమానిస్తున్నారు. ఇంతకు ముందు 7న ఉదంపూర్‌లోని బసంత్‌గఢ్ ప్రాంతంలో భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ప్రతికూల వాతావరణం, పొగమంచులో ఉగ్రవాదులు తప్పించుకున్నారు. ఉదంపూర్‌లోని బసంత్‌పూర్ ఎగువన ఉన్న అటవీ ప్రాంతంలో గత కొద్దినెలలుగా ఉగ్రవాదులు దాక్కున్నట్లుగా భావిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై బలగాలకు సమాచారం అందుతున్నది. అయితే, సహాయం అందించే వారు లేకపోతే అటవీ ప్రాంతంలో ఇంతకాలం దాక్కోవడం సాధ్యం కాదని ఆర్మీ వర్గాలు భావిస్తున్నాయి. సమాచారం మేరకు ఉగ్రవాదులు స్థానికంగా ఏదో ఒక ప్రదేశంలో ఆశ్రయం పొందుతున్నారని.. ప్రస్తుతం అడవులు, పర్వతాలు గుజ్జర్, బకర్వాల్‌లో అనేక శిబిరాలు ఉన్నట్లుగా అంచనా. ఉగ్రవాదులు బెదిరింపులకు పాల్పడుతూ భోజన ఏర్పాట్లు చేసుకుంటున్నారనే అనుమానాలు సైతం ఉన్నాయి. గత ఏప్రిల్ నుంచి ఈ ప్రాంతంలో ఉగ్రవాద కదలికలపై భద్రతా బలగాలకు సమాచారం ఉన్నది.